# శుభోదయం!
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి : 02, సంచిక : 156, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) సోమవారం - 25 - ఆగష్టు - 2025


## ఉక్రెయిన్ కు అమెరికా భారీగా ఆయుధ సాయం..!

ఉక్రెయిన్‌కు 3,350కి పైగా క్షిపణులు పంపనున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదించిన ఆయుధ ప్యాకేజీ




నిధులు సమకూరుస్తున్న యూరోపియన్ దేశాలు

రష్యాపై ప్రయోగించాలంటే పెంటగాన్ అనుమతి తప్పనిసరి

మొత్తం 32.2 కోట్ల డాలర్ల విలువైన సైనిక సాయం

ఆరు వారాల్లో కీవ్‌కు చేరనున్న కొత్త ఆయుధాలు

## గగన్ యాన్ మిషన్ లో కీలక ముందడుగు...

## ఇస్రో ఎయిర్ డ్రాప్ టెస్టు విజయవంతం

గగన్‌యాన్ మిషన్ కోసం ఇస్రో కీలక పరీక్ష విజయవంతం




పారాచూట్ ఆధారిత వేగాన్ని తగ్గించే వ్యవస్థపై ప్రయోగం

ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ (ఐఏడీటీ-01) సక్సెస్

వ్యోమగాముల సురక్షిత ల్యాండింగ్‌కు ఈ పరీక్ష కీలకం

## భారత్ లో పర్యటించనున్న జెలెన్ స్కీ

కీవ్ పర్యటనలో జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించిన మోదీ

ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా టూర్




ఈ ఏడాది చివరిలో రష్యా ప్రెసిడెంట్ పుతిన్ కూడా భారత్ కు రాక

### వినాయక చవితి వేళ తియ్యని కబురు

## చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

అనుమతి ఉన్న మండపాలకే ఈ సౌకర్యం వర్తింపు

ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలు

వేగంగా జరుగుతున్న హైదరాబాద్ గణేశ్ మండపాల ఏర్పాటు

తుది దశకు చేరిన ప్రఖ్యాత ఖైరతాబాద్ గణపతి విగ్రహం పనులు




హైదరాబాద్: తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు ఒక తీపికబురు అందించింది. వినాయక చవితి, దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్, దుర్గామాత మండపాలకు మిగతా.. 2లో

### శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో

## 4,71,386 క్యూసెక్కులు

కృష్ణానదికి కొనసాగుతున్న వరద ప్రవాహం ..




ఔట్ ఫ్లో 5,05,150 క్యూసెక్కులు

881.50 అడుగులకు చేరిన నీటిమట్టం

# సుప్రీంకోర్టు తీర్పుతో

# వారిలో భయం మొదలైంది

### పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

పదవులకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో గెలవాలని డిమాండ్

20 నెలల పాలనపై రేవంత్ రెడ్డి ప్రజాతీర్పు కోరాలని వ్యాఖ్య

కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు, హైడ్రా ఆగడాలపై తీవ్ర విమర్శలు

కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గుర్తు చేసిన కేటీఆర్

నాయకులు మోసం చేసినా కార్యకర్తలు పార్టీతోనే ఉన్నారని ప్రశంస



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే తక్షణమే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికలను ఎదుర్కొని గెలవాలని ఆయన సవాల్ విసిరారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొని ఉప ఎన్నికలకు రావాలని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని కే టీ ఆ ర్



స్ప ష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో ఓటమి భయం మొదలైందని కేటీఆర్ అన్నారు. అందుకే వారు రాజీనామా చేసేందుకు వెనుకాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే 'హైడ్రా' వ్యవస్థ పనిచేస్తోందని, దాని ఆగడాల వల్ల ఒకప్పుడు దేశానికే తలమానికంగా ఉన్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు కంటే, రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల కాలంలోనే ఎక్కువ అప్పులు చేశారని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని కేటీఆర్ నిలదీశారు. మిగతా.. 2లో




## సురవరం సుధాకర్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్ లో నిర్ణయం తీసుకుంటాం: సీఎం రేవంత్ రెడ్డి

- పీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి సీఎం రేవంత్ నివాళి
- సిద్ధాంతాలకు కట్టుబడిన గొప్ప నేత సురవరం అని కొనియాడిన ముఖ్యమంత్రి
- సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ
- గద్దర్, జైపాల్ రెడ్డిల మాదిరిగానే సురవరంకు సముచిత గౌరవం ఇస్తామని వెల్లడి



### ఓట్ల తారుమారుకు

## మోదీ యత్నం

- బిహార్లో జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా పేదల ఓట్లు దొంగిలించాలి
- చిన్న పిల్లలు సైతం 'ఓట్ల దొంగా.. గద్దె దిగు' అంటున్నారు
- 98.2 శాతం మంది డాక్యుమెంట్లు సమర్పించారు
- ధ్రువపత్రాలకు ఇంకా 8రోజుల సమయం మాత్రమే ఉంది

## రువుల బ్లాక్ మార్కెట్‌పై

# చంద్రబాబు సీరియస్.

### ధరలు పెంచితే కఠిన చర్యలే!

- ఎరువుల సరఫరా, ధరలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ధరలు పెంచే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
- బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి, యూరియా పక్కదారి పట్టకుండా చూడాలని సూచన
- క్షేత్రస్థాయిలో విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం చేయాలని స్పష్టం
- ప్రైవేటుకు కోటా తగ్గించి, మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా పెంచాలని నిర్ణయం



అమరావతి: రాష్ట్రంలో ఎరువుల ధరలను కృత్రిమంగా పెంచి రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకూడదని, ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం మోపాలని అన్నారు. ఆదివారం నాడు రాష్ట్రంలో ఎరువుల లభ్యత, సరఫరా పరిస్థితిపై ఆయన ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు వ్యవసాయ, విజిలెన్స్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాల వారీగా ఎరువుల నిల్వలు, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్న సీఎం, యూరియాను వ్యవసాయేతర పనులకు తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఎరువులను పక్కదారి పట్టిస్తే, వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయిలో విజిలెన్స్ తనిఖీలను ముమ్మరం చేసి, ఎప్పటికప్పుడు యూరియా నిల్వలను పర్యవేక్షించాలని చంద్రబాబు సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రైవేటు డీలర్లకు కేటాయింపులు తగ్గించి, ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల సరఫరాను గణనీయంగా పెంచాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన పునరుద్ఘాటించారు.

### బంగాళాఖాతంలో అల్పపీడనం...

## ఉత్తరాంధ్రకు మళ్లీ వర్ష సూచన

ఏపీలో రానున్న మూడు రోజులు వర్షాలు




ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షపాతం అంచనా

మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులకు అవకాశం

వాయువ్య బంగాళాఖాతంలో సోమవారం నాడు అల్పపీడనం

## బాలకృష్ణకు అరుదైన అంతర్జాతీయ గౌరవం..

### తొలి భారతీయ నటుడిగా రికార్డ్

హీరోగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు ఈ పురస్కారం

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి గోల్డ్ ఎడిషన్ గుర్తింపు

ఈ ఘనత అందుకున్న తొలి భారతీయ నటుడిగా రికార్డ్

ఆగస్టు 30న హైదరాబాద్‌లో ఘన సన్మాన కార్యక్రమం



అమరావతి: నటసింహం నందమూరి బాలకృష్ణ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఒక అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. భారతీయ సినీ పరిశ్రమలో కథానాయకుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, బ్రిటన్ కు చెందిన ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ఆయనకు 'గోల్డ్ ఎడిషన్ రికగ్నిషన్' పురస్కారాన్ని ప్రకటించింది. మిగతా.. 2లో




### 20 ఏళ్ల తరువాత

## ఓయూకు సీఎం...

### సమస్యల పరిష్కారంపై విద్యార్థుల ఆశలు

- రెండు దశాబ్దాల తర్వాత ఓయూకు సీఎం రేవంత్ రెడ్డి
- విద్యా సంస్కరణలపై ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- వేల సంఖ్యలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు
- భూకబ్జాలు, విద్యార్థి సంఘ ఎన్నికల నిర్వహణపై విద్యార్థుల డిమాండ్
- సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్లేందుకు సిద్ధమైన విద్యార్థి లోకం

## ఎగుమతులకు రూ 25000 కోట్ల ప్రోత్సాహకాలు



న్యూఢిల్లీ: ట్రంప్ సుంకాలతో ఆందోళనలో ఉన్న ఎగుమతిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే ఆరేళ్లలో ఎగుమతిదారులకు ప్రోత్సాహకాల రూపంలో రూ.25,000 కోట్లు అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం) కింద ప్రభుత్వం ఈ మొత్తాన్ని అందించనుంది. ఎగుమతిదారులకు తక్కువ వడ్డీతో సులభంగా రుణాలు అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అధికార వర్గాలు చెప్పాయి. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఎక్స్‌పెండీచర్ ఫైనాన్స్ కమిటీ (ఈఎఫ్‌సీ)కి పంపించినట్టు సమాచారం.

### బంగాళాఖాతంలో అల్పపీడనం...

## ఉత్తరాంధ్రకు మళ్లీ వర్ష సూచన

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) వెల్లడించింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం (ఆగస్టు 25) ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని కారణంగా రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్ర వాతావరణంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని వివరించారు. సోమవారం రోజున శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

### శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో

## 4,71,386 క్యూసెక్కులు

శ్రీశైలం: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 4,71,386 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో ఉండగా, 5,05,150 క్యూసెక్కులుగా ఔట్‌ఫ్లో నమోదైంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నీటి విడుదల వివరాలు ఇలా ఉన్నాయి: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా: 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా: 35,315 క్యూసెక్కులు,, కుడి గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా: 21,775 క్యూసెక్కులు, స్పిల్‌వే గేట్లు (10) ద్వారా: గేట్లను 18 అడుగుల మేర ఎత్తి, 4,18,060 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల,

**ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో:**

నీటిమట్టం: 881.50 అడుగులు (పూర్తి స్థాయి %-% 885 అడుగులు), నీటి నిల్వ సామర్థ్యం: 215.80 టీఎంసీలు, ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు: 196.11 టీఎంసీలు .

### వినాయక చవితి వేళ తియ్యని కబురు

## చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, అయితే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేసింది. ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మండపాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులు తుది ఘట్టానికి చేరుకున్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మండపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది.

## సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

గతంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిందని కేటీఆర్ గుర్తుచేశారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్‌ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నప్పటికీ, కేసీఆర్ నాయకత్వంలో ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. దీంతో నగరంలో ఇన్వర్టర్లు, జనరేటర్ల అవసరమే లేకుండా పోయిందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయకుండా హైదరాబాద్‌ను అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా అభివృద్ధి చేశామని చెప్పారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ పండుగలకు సమ ప్రాధాన్యత ఇస్తూ మతసామరస్యాన్ని కాపాడామని అన్నారు. అందుకే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా గులాబీ జెండాకే పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యేతో సహా పార్టీ మారిన వారంతా ప్రజల కోసం కాదని, కేవలం తమ స్వార్థ ప్రయోజనాలు, ఆర్థిక లాభాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే, ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి చూపించాలని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం టైంపాస్ మాటలు చెబుతూ, కేసీఆర్‌పైన, తనపైన కేసులు పెడతామని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు పార్టీని మోసం చేసి వెళ్లినా, బీఆర్‌ఎస్ కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### 27 వేల నూతన కార్డుదారులకు

## తొలిసారి సన్నబియ్యం

### జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు 2,70,731
### 5,127 మెట్రిక్ టన్నుల రైస్ కేటాయింపు
### వచ్చేనెలలో నూతన లబ్ధిదారులకు పంపిణీ
### జిల్లాకు 2.4 లక్షల చేతి సంచులు రాక
### దసరాకు సంచులు ఇచ్చేందుకు సన్నాహాలు




మహబూబాబాద్ : జిల్లాలో కొత్త రేషన్‌కార్డులు పొందిన పేదలకు సెప్టెంబర్ నెల నుంచి సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కార్డుదారుకుల రేషన్ కోటా కూడా కేటాయించి, విడుదల చేశారు. దీంతో వచ్చేనెల నుంచి కొత్త కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గత జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించిన రేషన్ బియ్యం అందించడం జరిగింది. ఈ సారి ఒక నెలకు సంబంధించిన రేషన్ బియ్యం మాత్రమే చౌకదారుల దుకాణం నుంచి అందించనున్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు దారులకు ఒక చేతి సంచిని కూడా ఉచితంగా అందించనుంది. కొత్త కార్డుదారులకూ రేషన్ అందుతుండడంతో లబ్ధిదా రులు ఆనందంతో ఉన్నారు.

పెరిగిన కార్డులు ..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తోంది. గత మూడు నెలలకు సంబంధించిన రేషన్‌బియ్య జూన్‌లో అందించగా ఈ సారి ఒకే నెలకు సెప్టెంబర్ నెలకు సంబంధించిన కోటా విడుదల చేసింది. జిల్లాలో ఏఎఫఎసీ కార్డులు 16823 ఉండగా ఎఫ్ఎసీ 2,53,906 కార్డులు, ఏఏపీ 2 కార్డులు వెరసి 2,70,731 రేషన్‌కార్డులు మహబూబాబాద్ జిల్లాలో ఉన్నాయి. అన్ని రేషన్‌కార్డులలో 8,03,717 మంది సభ్యులు ఉన్నారు. అన్ని రేషన్‌కార్డులకు కలిపి సెప్టెంబర్ నెలలో 5,127.945 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించడం జరిగింది. అయితే రేషన్‌కార్డులు పెరగడంతో పాటు బియ్యం కోటా కూడా పెరగడం జరిగింది.

కొత్త రేషన్‌కార్డులు ఇలా..

జిల్లాలో 2,43,204 పాత రేషన్‌కార్డులు ఉండగా, వాటికి 4,804 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేసేవారు. అలాంటిది ప్రస్తుతం కొత్తగా 2,7527 రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. అయితే కటాఫ్ తేదీలోపు మంజూరైన వారికి సుమారు 323 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం మంజూరైంది. పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి రేషన్‌కార్డు లభించడంతో ఆనందంతో ఉన్నారు.

గోదాంలలో చేతి సంచుల నిల్వలు..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం రేషన్‌కార్డుల పంపిణీ పథకంలో రేషన్‌కార్డుదారులకు ప్రత్యేకంగా చేతి సంచులను రూపొందించింది. తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్ నుంచి మహబూబాబాద్ జిల్లాలోని ఆరు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేతి సంచులు చేరుకున్నాయి. కేసముద్రంలో 37,914, మహబూబాబాద్‌లో 52,315, తొర్రూరులో 39,062, మరిపెడకు 45,714, గార్లకు 42,862, కొత్తగూడకు 22,676 సంచులు చేరుకున్నట్లు ఆయా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సమాచారం అందింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న అభయహస్తం పథకంలోని ఆరు గ్యారెంటీల ఇందిరమ్మలోగోతో తెల్లటి సంచిని తయారు చేసి చేతి సంచిపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రాలతో ముద్రించి ఉన్నాయి. వచ్చే నెలలో రేషన్ డీలర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఒక్క నెల కోటా మాత్రమే పంపిణీ : ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సెప్టెంబర్ నెలకు సంబంధించిన సన్నబియ్యం మాత్రమే మం జూరు అయ్యాయి. ఈ సారి రేషన్‌కార్డులు పెరిగాయి. దాంతో రేషన్ బియ్యం కోటా కూడా పెరిగింది. జిల్లాలో అన్ని రేషన్‌కార్డులు కలిపి 2,70,731లు ఉండగా అందులో 8,03,715 మంది సభ్యులు ఉన్నారు. వారికి గాను 5127.945 మెట్రిక్ టన్నుల బియ్యం అందించనున్నాం. కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులలో కటాఫ్ తేదీలోపు మంజూరైన వారికి బియ్యం పంపిణీ చేయనున్నాం.

## నామినేటెడ్‌పై ఆశలు

### పదవుల పందేరం అనంతరం స్థానిక ఎన్నికలకు
### సెప్టెంబరు నెలా ఖరులోగా కొలిక్కితెచ్చే యోచన
### వినాయక చవితి నుంచి నిమజ్జనంలోగా నామినేటెడ్ భర్తీకి గ్రీన్‌సిగ్నల్
### కాంగ్రెస్ కోర్‌కమిటీలో కీలక నిర్ణయం
### ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల నియామకాలపై కాంగ్రెస్ కీలక నిర్ణ యం తీసుకుంది. గణేశ్ నిమజ్జనంలోపే నామినేటెడ్ పదవులను భర్తీచేయాలని శనివారం జరిగిన పార్టీ కోర్‌కమిటీ, పీఏసీ సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజ్యాంగ, న్యాయనిపుణులతో చర్చించేందుకు ఓ కమిటీని ఏర్పాటుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందకపోవడంతో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులతో కూడిన కమిటీని కాంగ్రెస్ నియమించింది. వీరు రాజ్యాంగ, న్యాయనిపుణులతో సంప్రదించాలని నిర్ణయించింది. ఈనెల 29న జరిగే క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై తుది నిర్ణయం తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో వీలైనంతమేరకు అధికారికంగా 42శాతం బీసీ రిజర్వేషన్లతోనే వెళ్లాలని,లేని పక్షం లో పార్టీపరంగానైనా రిజర్వేషన్ కల్పించి స్థానిక ఎన్నికల ప్రక్రియను కోర్టు విధించిన సెప్టెంబరు నెలాఖరు గడువులోగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఈలోగా గణేశ్ చతుర్థి నుంచి నిమజ్జనం జరిగే లోపు నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తిచేయాలని నిర్ణయించింది. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు, వైస్‌చైర్మన్, డైరెక్టర్ పదవులనూ భర్తీ చేయాలని, ఇప్పటికే ఆశావహుల జాబితాలను పార్టీ జిల్లా పరిశీలకులు, ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా అధిష్టానానికి, సీఎంకు చేరవేశారు. నామినేటెడ్ పదవుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఉమ్మడి జిల్లాలోనూ ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లా నేతల ప్రయత్నాలు

యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతు న్న అండెం సంజీవరెడ్డి, కీలక నేతలు పొత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, పంజాల రామాంజనేయులుగౌడ్, పల్లె శ్రీనివాసగౌడ్, లింగంయాదవ్, తదితర నేతలు కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారు. వీరితో పాటు పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు, ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించిన నాయకుల పేర్లను రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. పదవుల పందేరం మొదలయ్యాక ఎవరికి అవకాశం దక్కుతుందో, అవి దక్కని వారిని ఎలా నచ్చజెబుతారనే అంశం తేలనుంది.

సూర్యాపేట జిల్లాలో..

ఉమ్మడి రాష్ట్రంలో ఐడీసీ సంస్థ డైరెక్టర్లుగా పనిచేసిన సాముల శివారెడ్డి (హుజూర్‌నగర్), కంచర్ల యాదగిరిరెడ్డి (తుంగతుర్తి) కూడా కార్పొరేషన్ పదవులు వస్తాయనే నమ్మకంలో ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన ఎరగాని నాగన్న, పీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు కూడా కార్పొరేషన్ పదవుల కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి సీనియర్ నేతలు ముత్తవరపుపాండురంగారావు, చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి కూడా పరిస్థితులు అనుకూలిస్తే కీలక పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో..

బీసీ కోటాలో పీసీసీ అధికార ప్రతినిధి పున్నా కైలాషనేత కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాన అనుచరుడు గుమ్ముల మోహన్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి వస్తుందని ఎంపీ ఎన్నికల సందర్భం గా మంత్రి కోమటిరెడ్డి బహిరంగంగా ప్రకటించారు. అయినా ఇప్పటివరకు ఆయనకు పదవి రాలేదని, ఈ దఫా ఖాయమని క్యాడర్ లో చర్చ సాగుతోంది. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన అనుచరుడు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డికి సైతం రాష్ట్ర కార్పొరేషన్లలో కీలక పదవి ఖాయమైందని చెబుతున్నారు. అయితే సామాజిక, జిల్లాల సమీకరణాల్లో మొదటి విడతలో ఆయనకు ఛాన్స్ దక్కలేదని, ఈ దఫా ఖాయమంటున్నారు.

నామినేటెడ్‌లో ఛాన్స్ దక్కింది కొందరికే..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీసీ సీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్‌కు, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. పార్లమెంటు ఎన్నికలకు ముందే తొలిదశలో జరిగిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేషరెడ్డి (సూర్యాపేట), మహి ళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బంద్రు శోభారాణి (ఆలేరు), రాష్ట్ర దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీర య్య (హుజూర్‌నగర్) నియమితులయ్యారు. వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి నియమితులయ్యారు.

గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్న ఆశావహులు..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచింది. స్థాని క సంస్థల ఎన్నికలూ లేకపోవడంతో ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు మినహా ఇతర నాయకులెవ్వరికీ ప్రొటోకాల్ సైతం వర్తించకపోవడంతో అధికారిక కార్యక్రమాల నిర్వహణ, అధికారులతో సమీక్షల్లో సైతం స్థానిక నాయకత్వానికి ప్రాతినిథ్యం లేకుండాపోయింది. పార్టీ పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న సందర్భంలో బరిగీసి కొట్లాడిన వారికి నామినేటెడ్ పదవులిచ్చే కార్యక్రమం తరచూ వాయిదా పడతూ వచ్చింది. దీంతో తమ సంగతేంటని, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులు గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్నారు. తాజాగా, నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని నిర్ణయించడంతో జిల్లాలో ఆశావహులు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు.

అవకాశం దక్కేదెవరికో?

ఉమ్మడి జిల్లా నుంచి నామినేటెడ్ పదవుల ను ఆశిస్తున్న నేతల్లో అదృష్టం ఎవరిని వరిస్తుందోననే అసక్తి సర్వత్రా నెలకొంది. మాజీ ఎమ్మెల్యేలు మొదలు కీలకమైన ద్వితీయశ్రేణి నేతలం తా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. కీలకమైన యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మం డలి చైర్మన్, బోర్డు సభ్యుల పదవులతో పాటు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు, జిల్లా స్థాయిల్లో ఉండే గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, మహిళా ఆర్గనైజర్ పదవులు, దేవాలయాల కమిటీల చైర్మన్ పదవులు, అర్బన్ డెవల్‌పమెంట్ అ?థారిటీల చైర్మన్ పదవులు, మార్కెట్ కమిటీ చైర్మన్ల వంటి పదవులను ఆశించే నాయకులంతా మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితి నెలకొంది. మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, డాక్టర్ కుడుదుల నగేశ్ కీలకమైన పదవి వస్తుందనే విశ్వాసంలో ఉన్నారు. కీలకమైన యాదాద్రి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి దక్కించుకోవడానికి ఉమ్మడి జిల్లా నేతలతో పాటు, ఇతర జిల్లాల నేతలూ, పారిశ్రామికవేత్తలూ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ పదవిని యాదాద్రి జిల్లాకు చెందిన నేతలకే ఇవ్వాలని స్థానిక నేతలు సీఎం, మంత్రుల వద్ద డిమాండ్ చేస్తుండడంతో దీనిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఫ నకిరేకల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిక్కెట్ ఆశించి భంగపడ్డ పీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్యకు సైతం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖాయమని తెలుస్తోంది. మరోవైపు దైద రవీందర్, అన్నెపర్తి జ్ఞానసుందర్ కూడా కార్పొరేషన్ పదవులకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జూలూరి ధనలక్ష్మి, నల్లగొండ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి మహిళా కోటాలో కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని ముఖ్య నేతలను కోరుతున్నారు.

## ఉక్రెయిన్ కు అమెరికా భారీగా ఆయుధ సాయం..!

ఢిల్లీ: రష్యా దాడులతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తూ అమెరికా మరో భారీ సైనిక సాయాన్ని ప్రకటించింది. కీవ్ గగనతల రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసే లక్ష్యంతో 3,350కి పైగా అత్యాధునిక ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ క్షిపణులను సరఫరా చేసేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారు. అయితే, ఈ శక్తిమంతమైన ఆయుధాలను రష్యా భూభాగంపై ప్రయోగించాలంటే ఉక్రెయిన్ తప్పనిసరిగా పెంటగాన్ అనుమతి తీసుకోవాలనే కీలక షరతు విధించారు. ఈ ఆయుధాల కొనుగోలుకు అవసరమైన నిధులను యూరోపియన్ దేశాలు సమకూరుస్తుండగా, రాబోయే ఆరు వారాల్లో క్షిపణులు ఉక్రెయిన్‌కు చేరనున్నాయి. 240 నుంచి 450 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఈ %జు=ూవీ% క్షిపణులకు ఉంది. అయితే, వీటి వినియోగంపై అమెరికా నియంత్రణ ఉంచడం గమనార్హం. ఇప్పటికే రష్యాలోని లక్ష్యాలపై దాడి చేయడానికి అమెరికా అందించిన లాంగ్-రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్ వాడకాన్ని పెంటగాన్ నిరోధిస్తోందని, ఇది కీవ్ ప్రతిదాడుల సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. తాజా సాయంలో భాగంగా అమెరికా మొత్తం 32.2 కోట్ల డాలర్ల ప్యాకేజీని ప్రకటించింది. ఇందులో 17.2 కోట్ల డాలర్లను ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థల కోసం, మరో 15 కోట్ల డాలర్లను ఆర్మర్డ్ వాహనాల నిర్వహణ కోసం కేటాయించనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇటీవల ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మళ్లీ తీవ్రతరం కావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు

### గగన్ యాన్ మిషన్ లో కీలక ముందడుగు...

## ఇస్రో ఎయిర్ డ్రాప్ టెస్టు విజయవంతం

ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. మానవసహిత అంతరిక్ష యాత్రలో వ్యోమగాముల భద్రతకు అత్యంత ముఖ్యమైన పారాచూట్ వ్యవస్థ పనితీరును పరీక్షించేందుకు చేపట్టిన "ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ (ఐఏడీటీ-01)"ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగం గగన్‌యాన్ మిషన్ విజయానికి చాలా కీలకమైనదిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చే క్రమంలో వ్యోమగాములు ఉండే మాడ్యూల్ వేగాన్ని నియంత్రించి, దానిని సురక్షితంగా దించడం కోసం ఈ పారాచూట్ వ్యవస్థను ఉపయోగిస్తారు. ఈ వ్యవస్థ మొదటి నుంచి చివరి వరకు ఎలా పనిచేస్తుందో సమగ్రంగా నిరూపించేందుకే ఈ తాజా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష ద్వారా పారాచూట్ వ్యవస్థ పనితీరును విజయవంతంగా ప్రదర్శించినట్లు ఇస్రో వర్గాలు తెలిపాయి. ఈ కీలక ప్రయోగం కేవలం ఇస్రో ఒక్కటే కాకుండా, దేశంలోని పలు ప్రముఖ రక్షణ, పరిశోధనా సంస్థల సమష్టి కృషితో సాధ్యమైంది. భారత వైమానిక దళం , డీఆర్‌డీఓ, భారత నౌకాదళం, ఇండియన్ కోస్ట్ గార్డ్ ఈ పరీక్షలో ఇస్రోతో కలిసి పాలుపంచుకున్నాయి. ఈ సంస్థలన్నీ సమన్వయంతో పనిచేసి ఈ క్లిష్టమైన ప్రయోగాన్ని విజయవంతం చేశాయి. గగన్‌యాన్ మిషన్ ద్వారా వ్యోమగాములను సురక్షితంగా అంతరిక్షంలోకి పంపి, తిరిగి భూమికి తీసుకురావడమే లక్ష్యంగా ఇస్రో ముందుకు సాగుతోంది. ఈ ప్రయోగ విజయం ఆ లక్ష్య సాధనలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది.

## భారత్ లో పర్యటించనున్న జెలెన్ స్కీ

ఢిల్లీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్ స్కీ త్వరలో భారత్ లో పర్యటించనున్నట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగు పర్చుకోవడమే ఈ పర్యటన ఉద్దేశమని ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్ చుక్ తెలిపారు. జెలెన్ స్కీ పర్యటనకు సంబంధించి తేదీలను ఖరారు చేయడంపై కసరత్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గతేడాది ఆగస్టులో కీవ్ ను సందర్శించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించారు. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ప్రధాని మోదీ ఒత్తిడి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతి కోసం వాదిస్తూ "ఇది యుద్ధ యుగం కాదు" అని నొక్కి చెప్పారు. పుతిన్, జెలెన్ స్కీలతో టెలిఫోన్ సంభాషణలు జరిపారు. భారతదేశం రెండు దేశాల మధ్య శాంతిని కోరుకుంటుందని వెల్లడించారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ ఏడాది చివరలో భారత్ కు రానున్నారు.

## సురవరం సుధాకర్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్ లో నిర్ణయం తీసుకుంటాం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. నిరుపేదలు, బహుజనుల పక్షాన నిలిచిన గొప్ప నేతను కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో ఉంచిన సురవరం సుధాకర్ రెడ్డి పార్థివదేహాన్ని ముఖ్యమంత్రి సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సీపీఐ జాతీయ నాయకులు డి. రాజా, కె. నారాయణ, కూనంనేని సాంబశివరావు, అజీజ్ పాషాతో మాట్లాడి సురవరం గారితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "సుధాకర్ రెడ్డి గారు విద్యార్థి దశ నుంచి జాతీయ రాజకీయాల వరకు ఒకే సిద్ధాంతంతో, నిరాడంబరంగా జీవించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసినా ఏనాడూ అహంకారం దరిచేరనీయలేదు. పాలమూరు బిడ్డగా బూర్గుల, జైపాల్ రెడ్డిల కోవలో ఆయన జిల్లాకు ఎంతో పేరు తెచ్చారు," అని కొనియాడారు. సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టాలని గతంలో సుధాకర్ రెడ్డి కోరగానే తక్షణమే అమలు చేశామని సీఎం గుర్తుచేశారు. "విలువలతో కూడిన నాయకులను గౌరవించుకోవడంలో మా ప్రభుత్వం ముందుంటుంది. కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ, గద్దర్, జైపాల్ రెడ్డిల పేర్లను చిరస్థాయిగా నిలిపాం. అదే విధంగా సుధాకర్ రెడ్డి గారిని కూడా శాశ్వతంగా గుర్తుంచుకునేలా సముచిత నిర్ణయం తీసుకుంటాం," అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తన సంతాప సందేశాన్ని పంపినట్లు సీఎం తెలిపారు.

## ఓట్ల తారుమారుకు మోదీ యత్నం

అరారియా, : ఓటర్ల జాబితాలను తారుమారు చేసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్లో జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా పేదల ఓట్లు దొంగిలించాలని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. చిన్న పిల్లలు సైతం 'ఓట్ల దొంగా.. గద్దె దిగు' అంటున్నారని.. ఈసీ వారితో మాట్లాడాలని సూచించారు. ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర' ఆదివారం అరారియా చేరుకుంది.ఓటర్ అధికార యాత్ర సందర్భంగా రాహుల్, తేజస్వి బుల్లెట్‌పై కాసేపు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి భద్రతావలయాన్ని ఛేదించుకుని వచ్చి రాహుల్ ఎడమ భుజంపై ముద్దుపెట్టాడు. వెంటనే భద్రతాసిబ్బంది అతడిని కొట్టి సెక్యూరిటీ జోన్‌కు దూరంగా తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఇదిలా ఉండగా, బిహార్లో ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా చేపట్టిన ఓటర్ల డాక్యుమెంట్ల తనిఖీ ముమ్మరంగా సాగుతోందని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఇప్పటివరకు 98.2 శాతం మంది డాక్యుమెంట్లు సమర్పించారని తెలిపింది. ధ్రువపత్రాలకు ఇంకా 8రోజుల సమయం మాత్రమే ఉందని పేర్కొంది.

## 20 ఏళ్ల తరువాత ఓయూకు సీఎం...

### సమస్యల పరిష్కారంపై విద్యార్థుల ఆశలు

హైదరాబాద్: తెలంగాణ ఉద్యమాలకు ఊపిరిపోసిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోకి సుమారు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి అడుగుపెట్టనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సోమవారం (25న) ఓయూను సందర్శించి, రాష్ట్ర విద్యారంగంలో చేపట్టనున్న సంస్కరణలపై కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ చారిత్రక పర్యటన నేపథ్యంలో, ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారంపై విద్యార్థులు గంపెడాశలు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తమ గోడును వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. యూనివర్సిటీలో అధ్యాపక, అధ్యాపకేతర పోస్టుల భర్తీ జరిగి దశాబ్దాలు గడుస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్క పోస్టును కూడా భర్తీ చేయకపోవడంతో వర్సిటీ అకడమిక్ పరంగా తీవ్రంగా దెబ్బతింటోంది. అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 1,400 టీచింగ్ పోస్టులకు గాను వెయ్యికి పైగా ఖాళీగా ఉన్నాయి. 2,300 నాన్-టీచింగ్ పోస్టులు కూడా భర్తీకి నోచుకోలేదు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే ఇంజనీరింగ్ విభాగంలో ఒక్క శాశ్వత ప్రొఫెసర్ కూడా లేరని, కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లతోనే నెట్టుకొస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉర్దూ విభాగంలో 19 మందికి గాను నలుగురు, సైకాలజీ, ఫిలాసఫీ విభాగాల్లో కేవలం ఇద్దరేసి ప్రొఫెసర్లు ఉండటం గమనార్హం. మరోవైపు, వందల ఎకరాల వర్సిటీ భూములు అన్యాక్రాంతం కావడం మరో పెద్ద సమస్యగా మారింది. నిజాం హయాంలో 2,200 ఎకరాలతో ఏర్పాటైన వర్సిటీ భూమి, ప్రభుత్వ రికార్డుల ప్రకారం 1950 నాటికి 1,627 ఎకరాలకు పరిమితమైంది. ప్రస్తుతం 251 ఎకరాలకు పైగా భూమి వివాదాల్లో ఉంది. కోర్టు విచారణలో సరైన పత్రాలు సమర్పించడంలో వర్సిటీ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే భూసర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. వీటితో పాటు, ప్రజాస్వామ్యానికి వేదికగా నిలిచిన విద్యార్థి సంఘం ఎన్నికలను పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఓయూ నుంచి ఎదిగిన ఎందరో నేతలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తుచేస్తూ, ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సీఎం పర్యటన ఈ సమస్యలన్నింటికీ ఒక పరిష్కారం చూపుతుందనే ఆశాభావంతో విద్యార్థి లోకం ఎదురుచూస్తోంది.

## బాలకృష్ణకు అరుదైన అంతర్జాతీయ గౌరవం..

ఈ మైలురాయిని చేరుకుని, ఈ గౌరవాన్ని పొందిన తొలి భారతీయ నటుడిగా బాలకృష్ణ చరిత్ర సృష్టించారు. యాభై ఏళ్ల పాటు హీరోగా కొనసాగడం అనేది భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అరుదైన విషయం. ఈ విశేషమైన ఘనతను గుర్తించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ, బాలకృష్ణ సినీ ప్రయాణాన్ని ప్రశంసిస్తూ ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు తెలుస్తోంది. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని ఆగస్టు 30వ తేదీన హైదరాబాద్‌లో ఒక భారీ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకలో బాలకృష్ణకు అధికారికంగా పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ వార్త తెలియగానే ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా...
## రాష్ట్రస్థాయి "టీచర్స్ క్రికెట్ లీగ్" పోటీలు



తిరుపతి జిల్లా, (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా, గూడూరు ప్రగతి సేవా సంస్థ, ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్" పోటీలు ఈ సంవత్సరం కూడా 20 మండలాల జట్లతో అల్లూరు ఆదిశేషా రెడ్డి ప్రభుత్వ స్టేడియం నందు ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 3 వ తేదీ వరకు నిర్వహించు టోర్నమెంట్ నందు భాగంగా "టీమ్స్ జెర్సీ" ప్రారంభోత్సవం మరియు ఫిక్సర్స్ కార్యక్రమం ను ఈ నెల 24వ తేదీ (ఆదివారం) శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆడిటోరియం సనత్ నగర్ నందు ఇనాగ్రేషన్ చేయడం జరిగింది. సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ గత ఆరు సంవత్సరాలుగా టిసిఎల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని ఆరు జట్లతో ప్రారంభించి నేడు 20 మండలాలు 20 జట్టులతో నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర చరిత్ర ఎక్కడ లేని విధంగా నిర్వహిస్తున్నామని 31వ తేదీ గౌరవ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ టోర్నమెంట్ ను ప్రారంభిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పీ.డి కరిముల్లా, మురళీ సింగ్, బాబర్ తదితరులు పాల్గొన్నారు.

## నెరవాటి పాలి క్లినిక్-లయన్స్ క్లబ్
### ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన
### ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ





నంద్యాల, (శుభోదయం న్యూస్): నంద్యాల గాంధీ చౌక్ సమీపంలో, పెద్ద పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న నెరవాటి పాలి క్లినిక్, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో, పాలీ క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్, డాక్టర్ అరుణకుమారి పర్యవేక్షణలో ఆదివారం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నెరవాటి పాలీ క్లినిక్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నంద్యాల వైద్యులు సేవా దృక్పథంతో వివిధ సందర్భాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గురువారం నెరవాటి పాలి క్లినిక్ లో ఓపి సేవలు ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ఉచిత వైద్య శిబిరంలో ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ సుమన్, స్త్రీవ్యాధి, ప్రసూతి నిపుణురాలు డాక్టర్ ఫాతిమా, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్య తేజ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నటరాజ్ ,దంత వైద్యురాలు డాక్టర్ పద్మ ప్రియాంక దాదాపు 300 మంది రోగులను పరీక్షించి, అవసరమైన పరీక్షలు నిర్వహించి, 50 వేల రూపాయల విలువచేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు 150 మందికి ఎముకల సాంద్రత పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు నెరవాటి సత్యనారాయణ, నెరవాటి పాలి క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ అరుణకుమారి, రమేష్, హరిబాబు, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి ,కోశాధికారి అమిదేల జనార్ధన్, వైద్య శిబిరంలో సేవలందించిన వైద్యులు సుమన్, ఫాతిమా, నటరాజ్ ,దివ్య తేజ ,పద్మా ప్రియాంక పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకును ప్రారంభించిన టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్



నంద్యాల రిపోర్టర్ / మోహన్ (శుభోదయం న్యూస్ ): స్థానిక ఆటోనగర్ ఎదురుగా ఎస్.మహబూబ్ బాషా నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎం ఫిల్లింగ్ స్టేషన్ ను టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా



ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నంద్యాల నియోజకవర్గం ఆటోనగర్ ప్రాంతంలో అనేక సంస్థలు రావటం చాలా సంతోషగా ఉందన్నారు. ఇక్కడికి వచ్చే ప్రజలకు నాణ్యతతో కూడిన పెట్రోల్ , డీజిల్ అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం వాహనదారులకు పెట్రోల్ , డీజిల్ పట్టి ఎస్ఎం ఫిల్లింగ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం నిర్వాహకుడు ఎస్.మహబూబ్ బాషా ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.అశ్రాఫ్ , ఎం. ఆఫ్సార్ బైగ్ , దీపక్ రెడ్డి, జోసఫ్, నూర్ భాషా, సర్దార్, ఆటోనగర్ జాకీర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నూర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం



ఏలూరు జిల్లా ప్రతినిధి- ప్రసాద్ (శుభోదయం న్యూస్ ): ఏలూరు పరిధిలోని వట్లూరు క్రాంతి కళ్యాణ మండపంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ పార్లమెంట్ కమిటీ, అనుబంధ సంఘాల కమిటీలు నియమించటానికి నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, మడకశిర ఎంఎల్ఏ ,టిటిడి బోర్డు మెంబర్ ఎం ఎస్ రాజు,మాజీ ఏంఎల్సి బుద్దా నాగ జగదీష్ గార్లు హాజరై ఆశావహుల నుండి దరఖాస్తుకు స్వీకరించటం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా మంత్రి వర్యులు కొలుసు పార్ధసారథి,ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లాలోనీ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి,సొంగా రోషన్ కుమార్,ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు గార్లు మరియు జిల్లాలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు. పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## బాబు షూరిటీ మోసం గ్యారంటీ



ఏలూరు జిల్లా ప్రతినిధి - ప్రసాద్ (శుభోదయం న్యూస్): ఏలూరు జిల్లా లింగపాలెం మండలం పాచానగరం గ్రామంలో అన్నపునేని శాంతారావుగారి ఆధ్వర్యంలో ఈరోజు గ్రామ పార్టీ అధ్యక్షులు ఎన్నిక నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లింగపాలెం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్నపనేని శాంతారావు, చింతలపూడి నియోజకవర్గం వైఎస్ఆర్పిపి ఇన్చార్జ్ కంభం విజయరాజు పాల్గొని బాబు షూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాన్ని ఆవిష్కరించారు తధానంతరం గ్రామంలో కటికనేని రఘుబాబు గారిని ఏకీగ్రీవంగా గ్రామ పార్టీ అధ్యక్షులుగా, మరియు కమిటీ సభ్యులు ని ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో లింగపాలెం మండల వైఎస్సార్సీపీ యూత్ ప్రెసిడెంట్ చిదరాల ప్రసాదు, మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామ (పంచాయతి)/ వార్డు (పట్టణ) పార్టీ కమిటీ

## సెంచరీ పానల్ ని పరిశీలించిన ఏ స్ పి శ్రీనివాస రావ్



బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం రిపోర్టర్ - నాగేంద్ర (శుభోదయం న్యూస్): గోపవరం మండలం పిపి కుంట దగ్గర ఉన్న సెంచిరి ప్లై వుడ్ కంపెనీ ఆకస్మికంగా విజిలెన్స్ అడిషనల్ స్ పి శ్రీనివాస రావు, ప్రస్తుత సీజన్ ఖరీఫ్ లో యూరియా కొరత బలంగా విస్తరించ్చిందని విజిలెన్స్ అధికారులు అక్మికంగా తనికీలు చేయడం జరుగుతుంది అందులో భాగంగా గోపవరం మండలం పిపి కుంట దగ్గర ఉన్న సెంచిరీ పానల్ కంపెనీ ని తనిఖీ చేసారు అక్కడ యూరియా డంప్ అవుతుంది అని సమాచారం తో అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా అక్కడ ఉన్న యూరియా టెక్నికల్ గ్రేడ్ యూరియా అని నిర్ధారణ అయినది ఈ యూరియా కేవలం ఇండస్ట్రియల్ పర్పస్ కోసం వాడుతున్నారని అధికారులు నిర్ణయం తీసుకొన్నారు ఈ కార్యక్రమం లొ రూరల్ సిఐ కృష్ణయ్య మండల వ్యవసాయ అధికారి విజయరావ్, గోపవరం యస్ ఐ శ్రీకాంత్ వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడులో కొత్తరకం కబ్జాలు
### మట్టి వ్యర్ధాల చాటున కబ్జా
### పట్టించుకోని రెవెన్యూ అధికారులు.



తొట్టంబేడు, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న తొట్టంబేడు రెవెన్యూ పరిధిలో ఈదులగుంట చెరువు సగభాగం కబ్జా కు గురైంది. అయితే మిగిలి ఉన్న కొద్ది భూ భాగం భూ బకాసురులు కొత్త రకం తరహాలో కబ్జాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ట్రాక్టర్లు సాయంతో మట్టి వ్యర్ధాలను గుట్టల గుట్టలుగా నింపి కొద్ది రోజులు గడిచిన తర్వాత చదును చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే ఈ విషయంపై పత్రికల్లో వచ్చినప్పటికీ అధికారులు నిమ్మకు నీరుతున్నట్లు వ్యవహరిస్తున్నారు. మట్టి రోడ్డును ఆనుకొని భూ కబ్జాల పర్వం ప్రారంభమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఒక్క ప్లాటు మాత్రమే కాదు దాదాపు 20 ప్లాట్లు ఈ రోడ్డును హానికని ఉన్న చెరువు భూ- భాగం మొత్తం కబ్జాకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు ఈ కబ్జాను అడ్డుకొని ఈదుల గుంటలో మిగిలి ఉన్న చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలు ఆదర్శంగా తీసుకోవాలి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి అన్నారు, హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆదివారం 165 నెల సేవా కార్యక్రమాలు నిర్వహించారు, ప్రత్యేక ప్రతిభవంతులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు ,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.. అనంతరం హెల్పింగ్ సంస్థ మీద నూతనంగా పాటను చిత్రీకరించడంతో పాటను ఆర్డీవో లాంఛనంగా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు ,హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధినేత మునీర్ భాషకు అభినందనలు తెలియజేశారు , హెల్పింగ్ హాండ్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలలో తనవంతు సేవా అందిస్తానని ఈ సందర్భంగా హెల్పింగ్ సంస్థ అధినేత మునీర్ భాషను కోరారు. హెల్పింగ్ హాండ్స్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకుని వారికి తోచిన విధంగా పేదలకు సహాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. సోమవారం నుంచి రేషన్ స్మార్ట్ కార్డులు ప్రజలకు పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు, శ్రీకాళహస్తిలో 11వేల పైచీలుకు రేషన్ స్మార్ట్ కార్డులు వచ్చి ఉన్నాయని ,ఐదు రోజుల పాటు ప్రజలకు పంపిణీ చేయనున్నామని తెలిపారు, రెవెన్యూ అధికారులు ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తారని తెలిపారు, ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మునిర్ భాష, యువతరం కిషోర్, కొల్లూరు హరినాథ్, రాజేశ్వరరావు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## యజ్ఞ హాస్పటల్ ఉచిత మేఘ వైద్య శిబిరం సేవలందించారు



(శుభోదయం న్యూస్): యజ్ఞ హాస్పిటల్, బాపట్ల వారు కాకుమానులో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో మొత్తం 250 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డా. యజ్ఞ శ్రీకాంత్ బెలంకొండ (జనరల్ గుండె వైద్య నిపుణులు), డా. మాధవి చెలంకొండ (రేడియాలజిస్ట్), డా. బి. పవన్ కుమార్ (ఎముకలు, కీళ్ళ నిపుణులు) పాల్గొని రోగులకు ప్రత్యేక వైద్య సలహాలు ఇచ్చారు. ఉచితంగా రక్తపోటు, షుగర్, ఈసిజి, ఎక్స్-రే, బీపీ టెస్టులు నిర్వహించగా, అవసరమైన మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో యజ్ఞ హాస్పిటల్ ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం. ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్య సేవలు చేరాలని మా కృషి" అని తెలిపారు. హాస్పిటల్ తరఫున శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు

## కోలా ఆనంద్ కుమార్ కి బలిజ సోదరుల ఘన సన్మానం



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): కోలా ఆనంద్ కుమార్ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన శుభ సందర్భముగా బలిజ సోదరులు వారి నివాసము వద్ద ఘనంగా సత్కారం చేసి శుభాకాంక్షలు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో సిద్దులు ప్రసాద్,ఉప్పు కృష్ణయ్య,పూల కృష్ణమూర్తి, గంగుల పూడి సుబ్బారావు,నరేంద్రబాబు, సూరగారిరమేష్,పసుపు లేటి గిరిధర్,బొక్కిసం మునిసుభయ్య, టౌన్ బ్యాంక్ భాస్కర్, ఏ ఎస్ ఐ ప్రసాద్,పురుషోత్తం బాబు,కప్పా హరికృష్ణ మేస్త్రి ఆనంద్,పసుపులేటి నవీన్ కుమార్, జాజాల ముని, అనిల్, సాగి సతీష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

## బిజెపి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్



లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్) : ఓబులాపురం గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు ఎం. నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ ఆశ్రయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది సహకారంతో చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ప్రతి వారం ఒక



రోజు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యాంపులలో రోగులకు వైద్య పరీక్షలు, చికిత్స, మందులు పూర్తిగా ఉచితంగా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఆర్థిక భారం లేకుండా ఆరోగ్య సంరక్షణ కల్పించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ మెడికల్ క్యాంపుకు స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సిరివరం మూర్తి మండల ఉపాధ్యక్షులు శేఖర్ యువ నాయకులు అవినాష్ రెడ్డి. వార్డు మెంబర్ లక్ష్మీదేవమ్మ. హరీష్. చంద్రప్ప. పరమేష్. మరియు శ్రీ ఆశ్రయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : కృష్ణా జిల్లా గన్నవరం మండలం వెంకటనరసింహపురంలో ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య డోలా లక్ష్మణ్ కుమార్ అనే వ్యక్తి కి బిందు పావని కి గత 15 ఏళ్ళ క్రితం ప్రేమ వివాహం. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. సమీప బంధువు దేవరపల్లి ప్రదీప్ అనే వ్యక్తి తో వివాహేతర సంబంధం పెట్టుకున్న బిందు పావని. భర్త లక్ష్మణ్ కుమార్ వీరిద్దరి అక్రమ సంబంధం కు అడ్డుగా ఉన్నాడని ఈ నెల 10 వ తేదీ రాత్రి వెంకటనరసింహపురం లోని అద్దె ఇంట్లో కొట్టి హత మార్చారని మృతుని బంధువులు ఆరోపణ చింతగుంట లో అంత్యక్రియలు పూర్తి చేసిన బంధువులు. వీరి స్వగ్రామం గన్నవరం మండలం చింత గుంట గ్రామం. 4 నెలల క్రితం నుండి వెంకటనరసింహపురం లో అద్దె ఇంట్లో నివాసం. భార్యపై అనుమానం వ్యక్తం చేసి గన్నవరం పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసిన మృతుని బంధువులు. ప్రియుడు దేవరపల్లి ప్రదీప్ పరారీలో ఉన్నట్లుగా సమాచారం. గురువారం మృతదేహాన్నీ వెలికి తీసి పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో 3 గంటల పాటు పోస్టుమార్టం నిర్వహించిన ప్రభుత్వ వైద్యులు. మృతుని భార్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు.

## యార్లగడ్డ వెంకట్రావు అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : కృష్ణా జిల్లా గన్నవరం మండలం, పెద్దఅవుట పల్లి బ్రదర్ జోసెఫ్ తంబి పుణ్య క్షేత్రంలో గౌరవ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆరోగ్యం త్వరగా కుదుట పడాలని ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు ,మండల



అధ్యక్షులు రవీంద్ర , కార్యదర్శి చంద్రశేఖర్ , క్లస్టర్ ఇంచార్జీ రవి, ఆళ్ల హానోకు, తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడిపల్లి రమాదేవి , మేడిపల్లి సురేష్,బొడ్డపాటి రవి, ఈసరి రవి, కంభంపాటి సాయి, కిట్టయ్య, సాయి, నిఖిల్, కాటనేని బ్రదర్స్, రెబ్బ తంబి, కుందేటి నాని, తుల్లిమెల్లి ఇన్నాయేసు , కలపాల మల్లికార్జున రావు, , మరీదు శ్రీధర్, యార్లగడ్డ లక్ష్మయ్య, దారం విజయ్, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వారిచే బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు దుస్తులు, షూలు వితరణ



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఈనెల 29, 30, 31 తేదీలలో ప్రకాశం జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. వీరి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు కావలసిన క్రీడా దుస్తులు పసుపులేటి కోదండరామయ్య, పసుపులేటి పార్థసారథి ఇతరనగా క్రీడాకారులకు ఇవ్వడం జరిగింది. వారు క్రీడాకారుల ఉద్దేశిస్తూ జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి రాష్ట్ర స్థాయిని ఉంటే జాతీయ స్థాయికి ఎదగాలని మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండాలని క్రీడా ఉద్యోగ విద్య అన్ని రంగాల్లోనూ ఉండాలి అన్ని వీరికి మా ట్రస్ట్ నుంచి ఎటువంటి సహాయం కావాలన్నా చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు చిత్తూరు జిల్లా బాల్పేట అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ వెంకట స్వామి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దాచేపల్లి ర్యాగింగ్ వీడియో కలకలం
**వీడియో వైరల్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు**

**బిజెపి పార్టీ ఆత్మ నిబ్బర భారత్ స్టేట్ సెక్రెటరీ శ్రీమతి గొర్లి విజయలక్ష్మి**



కృష్ణా జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ - లంక ఈశ్వర్ కుమార్ (శుభోదయం న్యూస్): పల్నాడు జిల్లా దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ వసతి గృహంలో విద్యార్థుల మధ్య గొడవ కలెక్టర్ అధీనంలో నిందితులపై యఫ్ ఐ ఆర్ చెయ్యడం జరిగింది, మరియు బాధితులకు న్యాయం జరిగింది. వారు మైనర్ బాలురు అవ్వడం వల్ల ఆ వీడియోని పల్నాడు కలెక్టర్ గౌరవనీయులు అరుణ్ కుమార్ గారు మరియు పోలీస్ సెక వైరల్ చెయ్యవద్దు అని చెప్పడం జరిగింది, అలా వైరల్ చేసినవారిపై పత్రిక ముఖంగా వైరల్ చేసిన వారిపై సుప్రీం కోర్ట్ ఆదేశాల అనుసరం ఐ టీ యాక్ట్ కేసులు పెడతాము అని వివరించడం జరిగింది కాబట్టి బిజెపి పార్టీ ఆత్మ నిబ్బర భారత్ స్టేట్ సెక్రెటరీ శ్రీమతి గొర్లి విజయలక్ష్మిగారి తరుపున తెలియపరడం ఏమంటే దయచేసి సోషల్ మీడియా గ్రూపులలో వాట్సాప్ గ్రూపులలో వీడియోని వైరల్ చెయ్యడం వల్ల మైనర్ బాలురు భవిష్యత్ దృశ్య వైరల్ చెయ్యవద్దని తెలియపరిచియున్నారు.

# ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబుని విమర్శించే అర్హత మైల జయరామిరెడ్డికి లేదు



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్ ): చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వడగళ్ల వాళ్ళలో నష్టపోయిన రైతులకు ఎందుకు నష్టపరిహారం చెల్లించలేదు పి ఎస్ సి సి వైస్ చైర్మన్ కాడ బోయిన నరేందర్ మంగపేట మండలం మల్లూరు గ్రామంలో మా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు నాయకత్వాన వడగండ్ల వానలతో నష్టపోయిన రైతుల పక్షాన రైతులకు నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని ధర్నా చేస్తే కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి ధర్నాకి అర్థం తెలియదని మాట్లాడడం విడ్డూరంగా ఉంది మా జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు అన్నా ఆపద అంటే అనేకమంది పేద ప్రజలకు నేనున్నానంటూ ఎన్నో సహకారాలు ఆర్థికంగా సహాయం అందించిన చరిత్ర లక్ష్మణ్ బాబు కు ఉంది ఏప్రిల్ లో కురిసిన వడగళ్ల వానకు ఐదు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని మీరే చెప్తున్నారు కానీ ఇప్పటివరకు రైతుల అకౌంట్లో ఎందుకు వేయలేదని ఆ నిధులను కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాహా చేయాలని చూస్తున్నారా ఎందుకు ఇప్పటివరకు రైతుల ఎకౌంట్లో వేయలేదని పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీశారు ఇప్పటికైనా మీకు చిత్తశుద్ధి ఉంటే వడగండ్ల వాన పడి నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని రిలీజ్ చేయాలని అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినాక యూరియా కొరత అధికంగా ఉందని మన ములుగు జిల్లాలో కూడా అనేక గ్రామాల్లో యూరియా కొరత ఉండి రైతులు మహిళలు చెప్పులను లైన్లో పెట్టుకుని పడిగాపులు పడాల్సిన దుస్థితి వచ్చిందని ఈ సందర్భంగా కాడబోయిన నరేందర్ అన్నారు కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు 24 గంటల కరెంటు యూరియా కొరతలు లేకుండా ముందు జాగ్రత్తతో రైతులను రారాజులను చేసిన ఘనత కేసిఆర్ కి బిఆర్ఎస్ పార్టీకి దక్కింది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతన్నల ఆత్మహత్యలు రాత్రిపూట కరెంటు సదుపాయం లేకుండా రైతులు పొలాల్లో పడుకునే దుస్థితి తీసుకువచ్చిం ది కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికైనా స్పందించి రైతుల కోసం వారి సంక్షేమం కోసం పాటుపడాలని హితవు పలికారు మల్లూరు లో నిన్న జరిగిన ధర్నా కార్యక్రమానికి రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించి ఒకళ్ళేమో చెక్కులు ఇచ్చేసామని మరొకరేమో 5 కోట్లు వచ్చినయ్ అని పత్రిక ముఖంగా ప్రకటనలు ఇస్తున్నారు తప్ప చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ నాయకుల్లారా ఇప్పటికైనా రైతుల పక్షాన ఉండి రైతులకు మేలు చేసే విధంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడితే బాగుంటుందని కాడబోయిన నరేందర్ అన్నారు ఇప్పటికైనా వడగండ్ల వాన నష్టపోయిన గ్రామాలు నర్సింసాగర్ నరేంద్రరావుపేట మోట్ల గూడెం మల్లూరు తిమ్మంపేట శనిగ కుంట పూరేడిపల్లి గ్రామ రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని చెల్లించకపోతే రాబోయే రోజుల్లో మా జిల్లా పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు నాయకత్వాన కలెక్టరేట్ ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బి ఆర్ స్ గ్రామ అధ్యక్షుడు ఉడుగుల శ్రీనివాస్ గ్రామ రైతులు పాల్గొన్నారు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యో...నేటి బాలలే.. రేపటి హంతకులా? తప్పటడుగులా.. తప్పుడు అడుగులా..




సంగెం, (శుభోదయం న్యూస్): మండలానికి చెందిన సైకాలజిస్ట్ బొజ్జ సురేష్ మాటల్లో పిల్లలపై ఓ కన్నేయండి. నేటి తరం పిల్లలు చరవాణికి బందీలవుతున్నారు. వారికి విలువలు నేర్పే వారే కరవ-య్యారు. పలువురు తల్లిదండ్రులకు తమ పిల్లలను పట్టించుకునే సమయం లేకపోవడమే ప్రధాన కారణం. ఇదే వారిని దారి తప్పేలా చేస్తుందని స్పష్టమవుతోంది. తాజాగా హైదరాబాద్ కూకట్ పల్లిలో నివాసం ఉండే సంగారెడ్డి జిల్లా ముక్తాక్యాసారానికి చెందిన సహస్రను పదో తరగతి విద్యార్థి అత్యంత కిరాతకంగా హత్య చేసిన విషయం తెలిసిందే. హర్రర్ సినిమాలు, సామాజిక మాధ్యమాలు మితిమీరి వినియోగించడం తోనే ఆ బాలుడు చెడు మార్గంలో వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల ప్రవర్తనపై అధ్యయనం చేస్తున్న తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిసి, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ బొజ్జ సురేశ్ ఇలా సూచించారు. అతిగారాబంతోనూ ముప్పే అతిగారాబంతో కొందరు తల్లిదండ్రులు.. పిల్లలు ఏం చేసినా సమర్థిస్తుండగా వారిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. అత్యధికులు కనీసం మందలించట్లేదు. ఇంట్లో పెద్దలు మొదలిస్తే మా ఇష్టం పిల్లలు అంటున్నారు, స్కూల్లో, కాలేజీలల్లో టీచర్లు, అధ్యాపకులు మొదలిస్తే మీకు అవసరమా? మీ పని చూసుకో! మా పిల్లలు అలాంటి వాళ్లు కాదు అని తెలుపుతున్నారు. కోరినవన్నీ ఇచ్చేస్తున్నారు. సరిగా వినియోగించడం తెలియక విపరీతంగా ప్రవర్తిస్తున్నారు. బడిఈడులోనే గాడితప్పుతున్నారు. పెరిగిన చరవాణీ వినియోగం గతానికి భిన్నంగా ప్రతి ఇంట్లో ఒకటికి మించి చరవాణులు ఉంటున్నాయి. అంతర్జాలం సైతం చౌకగా లభిస్తోంది. ఓటీటీల వినియోగం సైతం పెరిగింది. ఫలితంగా పిల్లలు హర్రర్ సినిమాలు, ఇతర షోలను యథేచ్ఛగా చూసేస్తున్నారు. ఇవే పిల్లల్లో నేరప్రవృత్తికి బీజం పడేలా చేసున్నాయని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థి తరగతి గదిలో ఉపాధ్యాయుడితో డబ్బు సంపాదించాలంటే చదువే ఎందుకు సర్, రీల్స్ చేసి ఇన్ ఫ్లు యెన్సర్ గా పేరు తెచ్చుకుంటే సరి పోతుందని చెప్పడం సామాజిక మాధ్యమాల ప్రభావానికి నిదర్శనం. తల్లిదండ్రుల్లో మార్పు వస్తేనే.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమ పిల్లలు గెలవాలని తల్లి. దండ్రులందరూ కోరుకుంటారు. పాఠశాల బాగుందా, మార్కులెలా వస్తున్నాయి. అన్న విషయాలకే ప్రాధాన్యం ఇచ్చి వదిలేస్తున్నారు. కానీ పిల్లల స్నేహితులెవరు, ఎటు వెళ్తున్నారు. వార్ ఆలోచనలు ఎలా ఉంటున్నాయన్నది మాత్రం పట్టించుకోవడమే మరిచారు. ఇందులో మార్పు రావాల్సిందే. చిన్నతనంలో గారాబం చేసినా, 5 నుంచి 15 ఏళ్ల లో పైతే దండించడంలో తప్పులేదు చరవాణిలో ఏం చేస్తున్నారో, ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. పుస్తక పఠనం ప్రోత్సహించాలి. ఈ విషయంలోఅమ్మానాన్నలు,ఉపాధ్యాయులూ చొరవ చూపాలి. అమ్మానాన్నలు.. తమ పిల్లలకు రోజూ కొంత సమయం కేటాయించాలి. మిత్రులుగా మెలగాలి. వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలి. పిల్లల ప్రవర్తనలో వస్తున్న మార్పును గమనించాలి. తీరిక వేళల్లో నీతికథలు చెప్పాలి. నేరపూరిత చిత్రాలు చూస్తే పసి మనస్సుల్లో నేరప్రవృత్తి పెరుగుతుంది. మానసిక శాస్త్రవేత్తల పరిశోధనల్లో ఇది రుజువైంది. ఇలాంటివి చూడకుండా జాగ్రత్త వహించాలి. తోటి వారితో, పాఠశాలలో, కళాశాలలో, హాస్టల్ లల్లో, ఎలా మెలుగుతున్నారనే విషయాలపై ఆరా తీస్తూ ఉండాలి.

# ఈ నెల 31న కామారెడ్డిలో జరిగే బామ్ సేఫ్ 12వ రాష్ట్ర మహాసభలను జయ ప్రదం చేయండి



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్), ఆగస్టు 24 : ఆగస్టు 31న కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న బామ్ సేఫ్, రాష్ట్రీయ మూల్ నివాసి సంఘ్ 12వ రాష్ట్ర మహాసభలకు తెలంగాణ నలుమూలల నుండి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు తరలి రావాలిని బివియం రాష్ట్ర కన్వీనర్ భూంపల్లి రవితేజ, బివియం రాష్ట్ర కార్యదర్శి విఠల్ కోరారు. తిప్పాపూర్ గ్రామంలో బాంసెఫ్ మహసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు రవితేజ, విఠల్, ప్రభాకర్ మాట్లాడుతూ ఈ దేశంలోని అనేక సమస్యల మీద పోరాడుతున్నటువంటి సంఘం బామ్ సేఫ్ అన్నారు. ఓబీసీ కుల జనగణన జరపాలని, ఈవీఎం మిషన్లను తొలగించాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఇలా అనేక సమస్యల పైన నిరంతరం పోరాడుతూ బహుజన సమాజాన్ని చైతన్యం చేస్తూ పూలే ,అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్న సంఘం బామ్ సేఫ్ అన్నారు. బాంసెఫ్ రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ యువ మోర్చా జిల్లా కన్వీనర్ ప్రభాకర్ భారత్ ముక్తి మోర్చా జిల్లా కన్వీనర్ గడ్డం రవి భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా కన్వీనర్ యశ్వంత్ తిప్పాపూర్ గ్రామ నాయకులు గణేష్, సురేష్, ప్రవీణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లి లోని క్రెస్కో హౌసింగ్ ప్రాజెక్టుకు నలుగురు బాధితులు బలి

## పది సంవత్సరాలు గడుస్తున్నా పూర్తికాని ఇండ్ల నిర్మాణం న్యాయం చేయండి అంటూ మీడియా ముందు బాధితుల వేడుకోలు






శుభోదయం ప్రతినిధి ప్రవీణ్ శంకర్‌పల్లి: ఆగస్టు 24: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపూర్ వార్డు సంగారెడ్డి రోడ్డు లో సర్వేనెంబర్ 317, 324 లలో 22 ఎకరాల 31 గుంటలతో 2015 మార్చి 14న క్రెస్కో హౌసింగ్ ప్రాజెక్టు విల్లాల ఏర్పాటుకు భూమి పూజ చేసింది. భూమి యజమాని జీకే రాజు. జీకే రాజు వద్ద క్రెస్కో కంపెనీ యాజమాన్యం అనిల్ కుమార్ సిద్ధూ, శ్యాంసుందర్ బేతి, దొమ్మాట నరసింహారావు అనే ముగ్గురు బిల్డర్లు వెంచర్ ను ఏర్పాటు చేస్తామని భూమిని తీసుకున్నారు. భూమి యజమానికి ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వాలని స్థానిక ఇన్వెస్టర్స్ విట్టలయ్య తండ్రి పెంటయ్య, సత్యం రెడ్డి తండ్రి అడివిరెడ్డి, పట్నం యాదయ్య తండ్రి సాంబయ్య, ఎస్ లచ్చయ్య తండ్రి పెంటయ్య వద్ద నుండి కోటి రూపాయలు ఇన్వెస్ట్మెంట్ గా తీసుకున్నారు. ఆ తర్వాత దొమ్మాట నరసింహారావు తన వాటాలో భాగస్వామిగా స్వాగతిస్తూ ప్రభాకర్ రెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి నుండి రెండు కోట్ల రూపాయలు తీసుకున్నారు. అనంతరం ముందుగా ఇచ్చిన చెక్కులు ఫెయిల్ అవ్వడంతో భూమి యజమాని జీకే రాజుతో ల్యాండ్ డెవలప్ మెంట్ కొరకు అగ్రిమెంట్ ఒప్పదం చేసుకున్నారు. ల్యాండ్ దేవలప్ మెంట్ సమయంలో స్థానిక పెట్టుబడి దారులు చెల్లించిన 3 కోట్ల రూపాయలు వారికి చెల్లించారు. అనంతరం 123 విల్లాలుగా చేసి అమ్మకానికి పెట్టారు. మొదటి విడతగా 10% చెల్లిస్తే చాలు అంటూ ఎక్కువ మందిని ఆకర్షించారు. సొంత ఇల్లు కట్టుకోవాలన్న కల నిజం అవుతుందన్న నమ్మకంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు, చిరు వ్యాపారులు క్రెస్కో వెంచర్ లో విల్లాలను తీసుకుందామని అప్పులు చేసి మరి 10% సొమ్ము చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నారు. వెంచర్ యాజమాన్యం మొదటి లైనులో 200 గజాలను 35 లక్షలకు, రెండవ లైనులో 167 గజాలను 23 లక్షలకు, మూడవ లైనులో 2002 గజాలను 41 లక్షలకు అమ్మింది. పది శాతం పోగా మిగిలిన సొమ్మును లోన్ ద్వారా చెల్లించే సదుపాయాన్ని కల్పిస్తామని చెప్పి డాక్యుమెంట్ ప్రాసెస్ కూడా చేసింది. దాని ఫలితంగా విల్లాలు కొన్న యజమానులకు లోన్ అప్రూవల్ లెటర్ కూడా వొచింది. ప్లేట్స్ యజమానులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలోనే భూమి యజమాని హఠాత్తుగా మరణించారు. ఇదే అదునుగా భావించిన క్రెస్కో హౌసింగ్ ప్రాజెక్టు ఇండియన్ బ్యాంకు యాజమాన్యానికి భూ యజమాని మరణించిన విషయం తెలిపి కొనుగోలుదారుల లోన్ ప్రాసెస్ ను నిలిపివేయించారు. అనంతరం వారిపై వారే ఆరోపనలను చేసుకొని ఒకరిపై ఒకరు కేసు పెట్టుకుని నమ్ముకున్న కొనుగోలు దారులను గందరగోళానికి గురి చేశారు.

ఇచ్చిన గడువు లోపల విల్లాలు నిర్మించలేక పోతున్నామని పివిఆర్ కంపెనీతో 50% భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందానికి అడ్వాన్స్ గా 5 కోట్ల రూపాయలు క్రెస్కో హౌసింగ్ ప్రాజెక్టు యాజమాన్యానికి ఇచ్చింది. పనులు ప్రారంభించిన పివిఆర్ కంపెనీ దాదాపు 5 కోట్ల రూపాయలు వెచ్చించి కొంతవరకు భవన నిర్మాణాన్ని కొనసాగించింది. వారితో తగాదా చేసుకుని వారిని భాగస్వామ్యం నుండి తప్పించింది. అనంతరం తర్వాత కొన్ని సంవత్సరాలకు రాధా టిఎంటి వారి దగ్గర కూడా వెంచర్ యాజమాన్యం 6 కోట్ల వరకు డబ్బు తీసుకుని ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. భూ యాజమాన్యానికి అగ్రిమెంట్ డబ్బులు ఇవ్వనందున రాధా టిఎంటి వారికి భూమి రిజిస్ట్రేషన్ చేయలేక ఒప్పంద రద్దుకై 6 కోట్లకు బదులుగా 9 విల్లాలు, 31 గుంటల భూమిని అగ్రిమెంట్ చేసి ఇచ్చింది. ఈ విధంగా వెంచర్ యాజమాన్యం 2 కంపెనీల వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకుని ఇద్దరిని క్రెస్కో మోసం చేసింది. 123 విల్లాలను కడతామని చెప్పి, మార్కెట్లో బ్రోచర్లను విడుదల చేసి మార్కెటింగ్ చేయించారు. 106 ఇండ్లు ఇప్పటికీ కూడా అసంపూర్తిగా ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు, చిరు వ్యాపారులు 2018లో క్రెస్కో వెంచర్ లో విల్లాలను తీసుకుందామని అప్పులు చేసి మరి కొనుగోలు చేశారు. వెంచర్ యాజమాన్యం ఇండ్లను అసంపూర్తిగా వదిలి వేయడం వల్ల కొనుగోలు చేసిన యజమానులు 5 గురు వారే సొంత డబ్బులతో పనులు పూర్తి చేసుకొని, బయట కిరాయి ఇళ్లల్లో కిరాయి కట్టలేక, వసతులు, అండర్ డ్రైనేజీ సరిగ్గా లేకుండా అందులో నివాసం ఉంటున్నారు. వెంచర్ యాజమాన్యం ఇండియన్ బ్యాంక్ ద్వారా లోన్లు ఇప్పిస్తానని చెప్పి, లక్షల్లో నగదును తీసుకొని మోసం చేసిందని బాధితులు ఆరోపించారు. మూడు దఫాలుగా నగదును కట్టామని తెలిపారు. ఇండ్లు పూర్తికాక ఇప్పటివరకు నలుగురు బలైపోయారు. ఇప్పటికైనా క్రెస్కో వెంచర్ యాజమాన్యం స్పందించాలని, బాధితులకు న్యాయం చేయాలని మీడియా ముందు మొరపెట్టుకున్నారు.

# మృతురాలు కుటుంబాన్ని పరామర్శించిన..... టిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు కొలెపాక బిక్షపతి



రేగొండ, మండల రిపోర్టర్ - మంతెన సురేష్ (శుభోదయం న్యూస్): రేగొండ మండల కేంద్రంనికి చెందిన బిఆర్ఎస్ యూత్ నాయకులు తాళ్లపల్లి చింటూ గౌడ్ నాయనమ్మ తాళ్లపల్లి సమ్మక్క అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని రేగొండ బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు కోలేపాక బిక్షపతి పరామర్శించి మృతురాలు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు పరామర్శించారు టిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు కోలేపాక బిక్షపతి 2000 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు మరియు పాక్స్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి 50 కిలోల బియ్యాన్ని పంపిణీ చేసి ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం కూలీకి సన్మానం




అనంతగిరి, ఆగస్టు.24 (శుభోదయం న్యూస్): పనుల జాతర - 2025 కార్యక్రమంలో భాగంగా ఈరోజున ఈ ఆర్థిక సంవత్సరంలో అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో అత్యధికంగా 743 మంది కూలీలు పనిచేయగా వారిలో అత్యధిక పనిదినాలు చేసిన ఉపాధి హామీ కూలీ వికలాంగురాలు అయిన తొడేటి రాజ్యం గారిని పనుల జాతర కార్యక్రమం సందర్భంగా ఈరోజు వారిని గ్రామ పంచాయతీ కార్యాలయం నందు అధికారికంగా సన్మానించడమైనది ఇట్టి కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌమ్య గారు ఫీల్డ్ అసిస్టెంట్ నందిగామ శ్రీనివాస్ సీనియర్ మేట్లు కొల్లు సుబ్బారావు చింతా సునిత మేళ్ళచెర్వు గురవయ్య కంటు శ్రీకాంత్ మరియు గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాద భీమా చెక్కు పంపిణీ



**అనంతగిరి, ఆగస్టు 24 (శుభోదయం న్యూస్): అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామానికి చెందిన వాయిలసింగవరం సంఘబంధం 1 కి చెందిన శ్రీ బాలాజీ సమభావన సంఘం సభ్యురాలైన తెలగపల్లి చిలకమ్మ ఇటీవల కరెంట్ షాక్ తో చనిపోవడం జరిగింది మహిళా సంఘంలో సభ్యురాలైన చిలకమ్మ భర్త నామినీ అయిన తెలగపల్లి సత్యనారాయణకు 10 లక్షల భీమా చెక్కును ఈరోజు గోండ్రియాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలోకోదాడ నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి గారి చేతులమీదుగా అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాలలో లేని మహిళలు అందరూ మహిళా సంఘాలలో చేరాలని అన్నారు మరియు ప్రభుత్వ పథకాలు పొందాలని సూచించారు ఇట్టి కార్యక్రమంలో అనంతగిరి మండల మహిళా సమాఖ్య ఏపీఎం సౌజన్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాసరెడ్డి మరియు లక్ష్మి యేసు లావణ్య వీవోఏలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.**

# రామగుండంలో మున్నూరు కాపు పటేల్స్‌యూత్

## ఫోర్స్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవం

## ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్




గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు రామగుండం మజీద్ టర్నింగ్‌లో మున్నూరు కాపు పటేల్స్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ హాజరై, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఇలా వైద్య శిబిరాలు ఎంతో అవసరమని, ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ఎంతో మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు.



ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో శివాజీ నగర్ బట్టల షాపులు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కు తరలింపు.



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్): తేదీ:24.08.2025 రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని గోదావరిఖని పట్టణంలో వస్త్ర ముఠా వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బట్టల షాపులను దాదాపు 40 సంవత్సరాలకు పైగా నడిపిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో చిన్నగా వ్యాపారాలను వారు ప్రారంభించడం జరిగింది. గతంలో పాత కూరగాయలం మార్కెట్ ఉన్న సందర్భంలో ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ కు వెనుక వైపు తమ వ్యాపారాలను కొనసాగించేవారు. రోడ్డు వెడల్పులో భాగంగా వారిని ఖాళీ చేయించారు. దాంతో శివాజీ నగర్ సింగరేణి క్వార్టర్ల పరిధిలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా చిన్న షెటర్లను కిరాయి కి తీసుకొని తమ వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తూ ఉన్నారు. చాలా ఏళ్ల నుంచి గోదావరిఖని పట్టణంలోని వినియోగ దారులకు వారికి చాలా మంచి సత్సంబంధాలు నెలకొని ఉన్నాయి. పాత ఖాతాదారులు షాపు వద్దకు వచ్చి కొనుగోలు చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. సామాన్య వినియోగదారునికి అందుబాటులో కూడా వీరి ధరలు ఉండడంతో ఎక్కువగా ఈ షాపులకు వచ్చి కొనుగోలు చేసేందుకు వారు ఇష్టపడుతూ ఉంటారు. గతంలోనే రోడ్డు వెడల్పులో భాగంగా శివాజీ నగర్ మార్కెట్ కు వచ్చిన వీరికి మరొకసారి షాప్ లో మార్చే పరిస్థితి తలెత్తాయి. అయినా మొక్కవోని ధైర్యంతో షాపులను తరలించడానికి వారు సుముఖత వ్యక్తపరిచారు. ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న షాపుల ఏరియాలో మళ్లీ వాణిజ్య సముదాయాలు నిర్మించడంతో వారు మారక తప్పని పరిస్థితి నెలకొంది. దీంతో షాపులు ఎక్కడ పెట్టుకోవాలని సందిగ్ధంలో ఉన్నప్పుడు ఈ వ్యాపారులు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ను వీరు కలవడం జరిగింది. చాలా రోజుల నుండి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వృధాగా మారడంతో వస్త్ర మూట వ్యాపారులు తమ దుకాణాలను షాపింగ్ కాంప్లెక్స్ లో నిర్వహించుకోవడానికి అనుమతిచ్చారు. దాంతో అస్తవ్యస్తంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ను కొంత మేరకు మరమ్మత్తులు చేసుకొని తమ వ్యాపారులను కొనసాగించడం జరుగుతుంది. వీరికి మద్దత్తుగా ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ వచ్చి వీరి షాప్ లను ప్రారంభించారు. ఇది ఇలా ఉండగా షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఉన్న అక్రమ కట్టడాలను కూడా తొలగించడంతో షాపింగ్ కాంప్లెక్స్ కాస్త బయటకు కనబడడానికి అవకాశం ఏర్పడింది. దాదాపు 26 షాపులను ఈ వస్త్ర ముఠా వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. షాపుల నిర్వాహకులు కాంతి కోసం లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో రాత్రి వేళలో వస్త్ర వ్యాపార దుకాణాలు మిరుమిట్లు గొలిపే విధంగా కనిపిస్తూ ఈ షాపింగ్ కాంప్లెక్స్ కే కళ తెచ్చినట్లుగా కనబడుతోంది. కాగా శివాజీ నగర్ నుండి తమ వస్త్ర వ్యాపార దుకాణాలను మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసుకున్నామని, వినియోగదారులు మాకు సహకరించి ఈ షాపింగ్ కాంప్లెక్స్ వచ్చి యధావిధిగా విచ్చేసి బట్టలు కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. తమ పాత పరిచయస్తులు వినియోగదారులతో పాటు కొత్తగా కూడా వినియోగదారులు వచ్చి తమ దగ్గర కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.



## గోదావరిఖని దుర్గా నగర్ లో అభివృద్ధి పనులలో భాగంగా వినాయక మండపం ప్రారంభోత్సవం

### రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం, రిపోర్టర్ -(శుభోదయం న్యూస్): తేదీ:24.08.2025 రోజున దుర్గానగర్ లే%-%అవుట్ రెసిడెన్షియల్ ప్లాట్ %d% ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులలో భాగంగా వినాయక మండపం ప్రారంభోత్సవం చేసిన రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మరియు వారి సతీమణి శ్రీమతి మనాలి రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి వర్యులు బట్టి విక్రమార్క, ఐటి శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో రామగుండం నియోజవర్గం



అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్. 300 కోట్లతో ప్రతి చిన్న గల్లి నుండి పెద్ద గల్లి లో రోడ్స్, మరియు డ్రైనేజ్, లైటింగ్, 230 కోట్లతో రామగుండం లో ఇంటిగ్రేటెడ్ స్కూల్.ఐ టి ఐ ను ఏ టి సి గా 100 కోట్లతో చేస్తున్నాము ఎం ఎస్ రాజ్ ఠాకూర్. రామగుండం లో జెన్ కో విద్యుత్ పవర్ ప్లాంట్ తీసుకొస్తున్నా ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రతి కాలనీ అభివృద్ధి, ప్రజల అవసరాల నెరవేర్పు, ఆధ్యాత్మిక%-%సాంస్కృతిక కార్యక్రమాలకు సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. దుర్గానగర్ కాలనీలో వినాయక మండపం ఏర్పాటు చేయడం స్థానిక ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రమే కాకుండా, సామాజిక కార్యక్రమాలకు కూడ అనువైన స్థలంగా మారుతుంది అని అన్నారు. కమిటీ సభ్యులు, కాలనీ వాసులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి, ఆయన సతీమణి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంకర్పల్లి మున్సిపాలిటీ పరిధి బుల్కాపురం గ్రామంలో 73,74,75, బూత్ అధ్యక్షులతో సమావేశం



శుభోదయం ప్రతినిధి: తలారి ప్రవీణ్ శంకర్పల్లి: ఆగష్టు 24: శంకర్పల్లి మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు చెందిప్ప దయాకర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎలక్షన్స్ దృష్టిలో పెట్టుకొని మాట్లాడారు ఈసారి బిజెపి అధికారంలోకి వస్తుందని ప్రతి గెలుపుకు బూత్ అధ్యక్షుల పాత్ర కీలకం అని చెప్పారు సమావేశంలో, కార్యదర్శి రాంమోహన్ రెడ్డి, పండిత్ రావ్, ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ దేవా, ప్రధాన కార్యదర్శి బీసోళ్ళ వెంకటేష్, బూత్ అధ్యక్షులు కంకంటి సంతోష్, తలారి వినోద్, మాల మాణిక్యం, గ్రామ సెక్రటరీ బోరంపేట రఘుపతి రెడ్డి కార్యకర్తలు తలారి ప్రభాకర్, గుంతల సుధాకర్ రెడ్డి, మన్నే శివకుమార్, మన్నే మహేష్ కుమార్, నాంచారి దయాకర్ ముత్తంగి భానుప్రసాద్ మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి వామపక్ష పార్టీలకు తీరని లోటు

### మెదక్ జిల్లా సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి అయ్యవారి లక్ష్మణ్



రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 24:-సిపిఐ పార్టీ అగ్ర నాయకులు,మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం తీరని లోటు అని మెదక్ జిల్లా సిపిఐ పార్టీ మాజీ సహాయ కార్యదర్శి అయ్యవారు లక్ష్మణ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన ఆదివారం నాడు విలేకరులతో మాట్లాడుతూ తొలి నుండి చివరి వరకు కమ్యూనిస్టు పార్టీతోనే ఉంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారన్నారు.ఆయనకున్న ఆస్తులను ప్రజలకు ధారాదత్తం చేసి ప్రజాసేవలో నిమగ్నమైన నిబద్ధతగల నేతని,సిపిఐకి మూడు పర్యాయాలు జాతీయ కార్యదర్శిగా,పార్లమెంటు సభ్యులుగా రెండు సార్లు పనిచేశారని గుర్తుచేశామన్నారు.బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అయన చేసిన కృషి చరిత్రలో నిలిచి పోతుందన్నారు.సురవరం ఆశయాల సాధన కోసం పయనిస్తూ ఆయన చూపిన మార్గాన ముందుకు సాగుతామన్నారు.1995 సంవత్సరంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో చిల్డ్రన్ పార్క్ లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ యొక్క మహాసభకు మెదక్ పట్టణంను ఎర్ర తోరణాలు బ్యానర్లతో అలంకరించడం జరిగిందన్నారు.ఈ సభకు నర్సాపూర్ ఎమ్మెల్యే సిపిఐ నాయకులు చిలుముల విఠల్ రెడ్డి మరియు ఏపీ సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నల్లగిరి ప్రసాద్ మరియు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఈ బహిరంగ సభకు ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.1995 సంవత్సరంలో జరిగిన సంఘటన జ్ఞాపకాలు మెదక్ పట్టణంలో ప్రజల ఆధ్వర్యంలో ర్యాలీ బహిరంగ సభకు ప్రజలు ర్యాలీని నిరసిస్తుండగా ఆనాడు ఉన్నటువంటి ఆకుల అంజయ్య కామ్రేడ్ మేర లక్ష్మణ్ పకీర సూర్యనారాయణ వడ్ల నరసింహులు బల్లెల బాబయ్య మరి కొంతమందిని మెదక్ పట్టణ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందన్నారు.మా బహిరంగ సభకు కామ్రేడ్ చిలుముల విఠల్ రెడ్డి ఎస్పీ గారితో మాట్లాడి ఆనాడు బహిరంగ సభ చిల్డ్రన్ ఫార్క్ లో భారీ ఎత్తున నిర్వహించడం జరిగిందన్నారు.కామ్రేడ్ గిరి ప్రసాద్ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి,చిలుముల విఠల్ రెడ్డి ఉపన్యాసించారు.1997 సంవత్సరంలో మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని నందిగామ గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేయడం జరిగిందన్నారు.అనంతరం గ్రామంలో సిపిఐ పార్టీ కార్యకర్తల సమావేశం కూడా నిర్వహించడం జరిగిందని.అందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పాల్గొనడం జరిగిందన్నారు.సిపిఐ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి తో మెదక్ జిల్లాకు ఉన్న అనుబంధాన్ని వివరించడం జరిగిందన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటామని సిపిఐ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.ఆయన మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు వారు తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు మరాఠీ కిష్టయ్య,మేకల నాగరాజు, శ్రీనివాస్,శేఖర్,యేసుమణి,గణేష్ జిల్లా సహాయ కార్యదర్శి ఖదీర్ జిల్లా ప్రధాన కార్యదర్శి



పానుగంటి నందం,సహాయ కార్యదర్శి కేశవులు,భవన నిర్మాణ కార్మిక అధ్యక్షులు కొండ లక్ష్మణ్,జిల్లా దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్,ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షులు అయ్యవారు విష్ణు,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆకిరెడ్డి రాజిరెడ్డి,బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీడి బాలమణి,పార్వతి,భవన నిర్మాణ సంఘం నాయకులు ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## శుభ్రత ఫుట్బాల్ కప్పుకు తరలి వెళ్లిన బాలుర ఫుట్బాల్ టీమ్

### క్రీడా విద్యార్థులకు టీ షర్టు పంపణి




రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 24 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రణాళిక మరియు అభివృద్ధి కోసం రాష్ట్ర స్థాయిలో శుభ్రత బెనర్జీ ఫుట్బాల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన సందర్భంగా రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు ఫుట్బాల్ పోటీలు గవర్నమెంట్ లో పాల్గొని అవకాశం రావడంతో రామాయంపేట పట్టణ మండల మరియు ఫుట్బాల్ కు యువజ్యోతి ఫుట్బాల్ అకాడమీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణ విద్యార్థులు నేడు టోర్నమెంట్ కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రామాయంపేట పాఠశాల పిడి నాగరాజు విద్యార్థులకు టీషర్టు పంపిణి చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ శుభ్రత ఫుట్బాల్ టోర్నమెంట్ ఎంతో ప్రతిష్టమైనదన్నారు.విద్యార్థులకు ఈ సర్టిఫికెట్ ఫ్యూచర్ లో ఎంత ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టంగా చేపట్టిన టోర్నమెంట్ లో పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. క్రమశిక్షణతో క్రీడాకారులు ముందుకెళ్లాలని ఫుట్బాల్ అనే క్రీడలు శారీరకంగా మానసికంగా ఎంతో దృఢమైనదన్నారు.ఈ సందర్భంగా యువజ్యోతి ఫుట్బాల్ అకాడమీ కోఆర్డినేటర్ కోచ్ సత్యనారాయణ మాట్లాడుతూ రామాయంపేట జిల్లాలో 50 ఏళ్ల చరిత్ర ఉందని ఎంతోమంది సీనియర్ క్రీడాకారులు ఉన్నారన్నారు.రాష్ట్ర స్థాయిలో జాతీయ స్థాయిలో కూడా క్రీడాకారులు ఈ మైదానం నుంచి ఆడడం జరిగిందన్నారు.ముఖ్యంగా రామాయంపేట పాఠశాల పిడి మరియు ఎస్జిఎఫ్ సెక్రటరీ అయిన నాగరాజు మెదక్ జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ సెక్రటరీగా కూడా ఫుట్బాల్ క్రీడాకారులకు అన్ని విధాల సహకరిస్తుండన్నారు.హైదరాబాద్ శుభ్రత ఫుట్బాల్ కి వెళ్లే విద్యార్థులకు నేడు 40 టీషర్ట పంపించడం వారికి కావాల్సిన బస్సు సౌకర్యాన్ని అందజేసి వారిని పంపించడం ఎంత శ్రమకైనా ఆయన ముందుకొచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ చంద్రశేఖర్ బాలుర పాఠశాల ఫుట్బాల్ టీం కోచ్ కుమ్మరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ సౌత్ జోన్ -1టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు




తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్),ఆగస్టు 24: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని మాస్టర్ నరసింహ అన్నారు. మార్కాపూర్ లోని సీబీఎస్సీ సౌత్ జోన్ 1లో జరిగిన కంబాట్, టైక్వాండో స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఒకరు బంగారు రజత పతకం, మరొకరు కాంస్య పథకాలను గెలుచుకున్నారు. అదేవిధంగా బలిశెట్టి అవినాష్, స్వరాజ్ మన్చుందా, ప్రఖ్యాత్ ఐశ్వర్య జాతీయ స్థాయి పోటలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాస్టర్ నరసింహ విద్యార్థుల కృషి, నిజాయితీగల అభ్యాసాన్ని ఆయన అభినందించారు.

## పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక

### -సంఘం అభివృద్ధికై కృషి చేస్తా గంజి వెంకటేశ్వర్లు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):మండల కేంద్రంలో నూతన పద్మశాలి సంఘం పట్టణ కమిటీని ఆదివారం సాయిగణేష్ ఫంక్షన్ హోల్లో పద్మశాలి కులస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా సాయిని యాదగిరి, అధ్యక్షులుగాగంజి వెంకటేశ్వర్లుఉపాధ్యక్షులు దొంత శ్యామ్ సుందర్,కందగట్ల వెంకటేశం,ప్రధాన కార్యదర్శి రచ్చ సంతోష్,కోశాధికారి నామాల జగన్మోహన్,సహాయ కార్యదర్శి ఎక్కలదేవి శ్రీనివాస్,సంస్కృతిక కార్యదర్శి యలగందుల లెనిన్,డైరెక్టర్లు పెండెం విగ్నేష్ గంజి ఉపేందర్,గర్దాస్ మనోహర్,బడుగు లింగస్వామి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షులు గంజి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన కుల పెద్దలందరికీ కృతజ్ఞతలు జేస్తూ,నాకు ఇచ్చిన బాధ్యతనునిస్వార్థంగాసమర్థవంతంగా నిర్వహిస్తానని వలిగొండ పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బడుగుసత్యనారాయణ గంజి నారాయణ దొంత శంకరయ్య జెల్ల నరేందర్,ఐటిపాముల కుమార్,ఐటి పాముల ప్రభాకర్,ఐటిపాముల రవీంద్ర,గంజి బాలనరసింహ, కూరపాటి భూమయ్య రాపోలు సుధాకర్, గుంటి రవీందర్,పున్న ఆంజనేయులు,బోడ కుమారు,మిర్యాల భాస్కరు,మిర్యాల వెంకటేశం,రాపోలు శ్రీను,వంగరి రమేష్ మిరియాల శీను మరియు పద్మశాలి కులస్తులు కవిత తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక

### -సంఘం అభివృద్ధికై కృషి చేస్తా గంజి వెంకటేశ్వర్లు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):మండల కేంద్రంలో నూతన పద్మశాలి సంఘం పట్టణ కమిటీని ఆదివారం సాయిగణేష్ ఫంక్షన్ హోల్లో పద్మశాలి కులస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా సాయిని యాదగిరి, అధ్యక్షులుగాగంజి వెంకటేశ్వర్లుఉపాధ్యక్షులు దొంత శ్యామ్ సుందర్,కందగట్ల వెంకటేశం,ప్రధాన కార్యదర్శి రచ్చ సంతోష్,కోశాధికారి నామాల జగన్మోహన్,సహాయ కార్యదర్శి ఎక్కలదేవి శ్రీనివాస్,సంస్కృతిక కార్యదర్శి యలగందుల లెనిన్,డైరెక్టర్లు పెండెం విగ్నేష్ గంజి ఉపేందర్,గర్దాస్ మనోహర్,బడుగు లింగస్వామి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్షులు గంజి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన కుల పెద్దలందరికీ కృతజ్ఞతలు జేస్తూ,నాకు ఇచ్చిన బాధ్యతనునిస్వార్థంగా సమర్థవంతంగా నిర్వహిస్తానని వలిగొండ పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బడుగుసత్యనారాయణ గంజి నారాయణ దొంత శంకరయ్య జెల్ల నరేందర్,ఐటిపాముల కుమార్,ఐటి పాముల ప్రభాకర్,ఐటిపాముల రవీంద్ర,గంజి బాలనరసింహ, కూరపాటి భూమయ్య రాపోలు సుధాకర్, గుంటి రవీందర్,పున్న ఆంజనేయులు,బోడ కుమారు,మిర్యాల భాస్కరు,మిర్యాల వెంకటేశం,రాపోలు శ్రీను,వంగరి రమేష్ మిరియాల శీను మరియు పద్మశాలి కులస్తులు కవిత తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తాండ్ర సదానందం




ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) ఆగస్టు-24: ఈ నెల 20 నుంచి 22 వరకు హైద్రాబాద్ లోని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా గాజుల రామారంలో జరిగిన సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రాష్ట్ర నాయకత్వం ఎన్నుకున్నందుకు అభినందనలు తెలుపుతున్నానని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం. ఒక ప్రకటన లో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న నాటి నుంచి కమ్యూనిస్ట్ పార్టీ మరియు ప్రజా సంఘాల లలో పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి పెద్దపల్లి జిల్లా కార్యదర్శి గా పని చేస్తూ అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ సిపిఐ పార్టీ ని జిల్లా లోని వివిధ మండలాల్లో నిర్మాణం బలోపేతం చేస్తున్న తరుణంలో రాష్ట్ర నాయకత్వం గుర్తించి నవ యువతరానికి పెద్ద పీట వేస్తున్న సందర్భంలో పెద్దపల్లి జిల్లా ఉద్యమ స్ఫూర్తి ని గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించినందుకు రాష్ట్ర పార్టీ నాయకత్వానికి విప్లవ అభినందనలు తెలియ జేస్తూ జిల్లాలో పార్టీ ని, ప్రజా సంఘాలను మరిన్ని ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేసి ముందుకు సాగుతామని తాండ్ర సదానందం పేర్కొన్నారు.

## ఘనంగా వైకుంటపతి 69వ జయంతోత్సవం



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) ఆగస్టు -24: తెలంగాణ ఉద్యమకారుడు రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేనివిధంగా 1530 రోజులు నిరాహార దీక్ష నిర్వహించినటువంటి తెలంగాణ పోరాట యోధుడు స్వర్గీయ పారుపల్లి వైకుంతపతి జయంతి సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు వైకుంట పతి శిష్యులు కేక్ కోసి మిఠాయిలు పంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాసెడ్ల రవీందర్ , పారుపల్లి సజయ్, రాచకట్ల శ్రీనివాస్ రజాక్ టైలర్, గదాసు విజయ్, లెక్కల శంకరయ్య, మురళి కృష్ణ, ఒజ్జ కనకయ్య, తొర్రికొండ సత్యనారాయణ, దాడి నాగరాజు, కల్వల శ్రీనివాస్ , సంపత్ లు పాల్గొన్నారు.

### జిన్నారం మున్సిపల్ కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించిన...

## హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూరే పల్లినంద, జస్టిస్ అనిల్ కుమార్




జిన్నారం, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సంగారెడ్డి జిల్లా పోర్ట్ పోలియో జడ్జ్ జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ అనిల్ కుమార్ చేతుల మీదుగా జస్టిస్ సురేపల్లి నంద రిబ్బన్ కట్ చేసి జిన్నారం జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టును ప్రారంభించడం జరిగింది, అనంతరం జూనియర్ సివిల్ జడ్జ్ ధనలక్ష్మి బెంచ్ ప్రారంభించడం జరిగింది, అనంతరం నూతన కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సంగారెడ్డి జిల్లా పోర్ట్ పోలియో జస్టిస్ సూరేపల్లి నంద మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న చట్టపరమైన సమస్యలను న్యాయస్థానం ద్వారా పరిష్కరించుకోవడం కోసం న్యాయస్థానాల ప్రాముఖ్యత, న్యాయవాదుల ప్రాముఖ్యత కీలకమన్నారు, దేశంలో ప్రతి సామాన్య పౌరుడికి సామాజిక న్యాయం జరగాలని న్యాయస్థానం ఆకాంక్షాన్ని, న్యాయవాదులు నా స్థానంలో బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు, చట్టం ముందు అందరూ సమానులే అని తప్పు చేసిన వ్యక్తి చట్టం నుండి తప్పించుకోవడానికి ఆస్కారం లేకుండా కొత్త చట్టాలను ప్రవేశపెట్టిందని తద్వారా నిందితుడు చట్టం నుండి తప్పించుకోవడానికి ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు చట్టపరమైనటువంటి ఇన్వెస్టిగేషన్లో సామాజిక మాధ్యమాలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియా ద్వారా సాక్షాలు బలంగా చట్టం దృష్టికి రావడంతో తప్పు చేసిన వ్యక్తి కఠినంగా శిక్షించబడతారు, తప్పించుకోవడానికి నమస్కారం లేదన్నారు, భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రతి పౌరుడికి సంపూర్ణంగా పొందడం కోసం న్యాయస్థానాల ద్వారా సంపూర్ణ న్యాయం పొందడం కోసం పలు రకాల తగాదాలను పరిష్కరించుకోవడం కోసం న్యాయస్థానాలు దోహదపడతాయి అన్నారు, రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న కేసులను సత్వరమే న్యాయస్థానాల ద్వారా పరిష్కారం చేసుకోవడం కోసం ప్రజలకు కక్షిదారులకు న్యాయస్థానాల పాత్ర కీలకమన్నారు. చట్టం ముందు అందరు సమానులేనని, న్యాయస్థానాల ద్వారాన్యాయం పొందడం కోసం జిన్నారం జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ పాత్ర కీలక అన్నారు. సంగారెడ్డి బార్ అసోసియేషన్, నర్సాపూర్ బార్ అసోసియేషన్ సమిష్టిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ అనిల్ కుమార్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియడం జరిగింది, ఈ కార్యక్రమంలో



సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర, జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కే. జయంతి, జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి కృష్ణార్జున రెడ్డి, జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి సునితా రవీందర్ రెడ్డి, జిల్లా నాలుగవ అదనపు న్యాయమూర్తి లావణ్య బాల్ రెడ్డి, సంగారెడ్డి సబ్ జడ్జ్ తేజో క్రాంతి, న్యాయమూర్తి దీప్తి, న్యాయమూర్తి ఆర్. అనిత, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సౌజన్య, న్యాయమూర్తి ధనలక్ష్మి, జోగిపేట్ న్యాయమూర్తి అసదుల్లా షరీఫ్, నారాయణఖేడ్ న్యాయమూర్తి శ్రీధర్ మందాని, జహీరాబాద్ న్యాయమూర్తి కవితా దేవి, హైకోర్టు జి.పి. ప్రతాప్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, జిల్లా ఎస్పీ



పారితోష్ పంకజ్, పటాన్చెరు డిఎస్పి రవీందర్, జిన్నారం సి.ఐ.మైముద్దీన్,బొల్లారం సి.ఐ.రవీందర్ రెడ్డి,జిన్నారం తహసిల్దార్ దేవదాస్,జిన్నారం ఎంపీడీవో రాజేష్ కుమార్ గౌడ్,జిన్నారం ఎస్.ఐ. హనుమంతు, గుమ్మడిదల ఎస్సై, నర్సాపూర్ జూనియర్ సివిల్ డెడ్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. రాఘవేందర్, ఏ.జి.పి.సుధాకర్, స్థానిక న్యాయవాదులు డి.శ్రీధర్ రెడ్డి,బేగారి బాలకిషన్,సీనియర్ న్యాయవాది ఏ.అంజిరెడ్డి జాఫర్, న్యాయవాదులు కే.ప్రకాష్,ఏ.శ్రీనివాస్, ఎం.శంకర్ రెడ్డి,కె.ఏ.శ్రీనివాస్, స్వరూప రాణి, సత్యనారాయణ, ప్రభు, ఆనంద్ కుమార్, జరుపుల రాజు నాయక్, రాజు నాయక్, సాయిరాం, రవి నాయక్, తదితరణ న్యాయవాదులు, జిన్నారం మాజీ ఎంపీపీ దమ్మ గోని రవీందర్ గౌడ్, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు జి. వెంకటేశం గౌడ్, బిజెపి జిల్లా నాయకులు వంగేటి ప్రతాపరెడ్డి, జిన్నారం మాజీ ఉపసర్పంచ్ గుట్ట మీద శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పొట్టి భాస్కర్, యువజన సంఘాల నాయకులు ఆది రామకృష్ణ, గొర్ల శ్రీనివాస్ యాదవ్, ముని నర్సింలు, నరేందర్ గౌడ్, ఏర్పుల వినేష్, ఎర్రవాలి ప్రవీణ్, బండి శ్రీకాంత్ గౌడ్, ఏర్పుల లింగం, తదితర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు గ్రామ ప్రజలు మహిళలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ : భారత్ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ ఆయుధ వ్యవస్థ పరీక్ష విజయవంతమైనట్లు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ప్రకటించారు. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) అభివృద్ధి చేసిన ఈ వైమానిక వ్యవస్థను శనివారం అర్ధరాత్రి ఒడిశా తీరం నుండి విజయవంతంగా పరీక్షించిందని అన్నారు. డిఆర్‌డిఒ, సాయుధ దళాల మరియు రక్షణ వ్యవస్థను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఐఎడిడబ్ల్యుఎస్ అనేది అన్ని స్వదేశీ క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టూ ఎయిర్ మిసైల్ (క్యూఆర్ఎస్ఎఎం), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (విఎస్‌హెచ్ఒఆర్ఎడిఎస్) క్షిపణుల మరియు హైపవర్ లేజర్ –ఆధారిత డైరెక్టెడ్ లేజర్ ఆధారిత ఎనర్జీ వెపన్ (డిఇడబ్ల్యు)లను కలిగి ఉన్న బహుళ అంచెల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ. ఈ ప్రత్యేకమైన వైమానిక పరీక్ష బహుళ అంచెల వాయు రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని వెల్లడించిందని అన్నారు. శత్రువులు ప్రయోగించే వైమానిక దాడుల నుండి ఆయా ప్రాంతాల రక్షణను ఇది బలోపేతం చేయనుందని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవస్థలో రాడార్, లాంచర్లు, లక్ష్య మరియు మార్గదర్శక వ్యవస్థలు, క్షిపణులు మరియు కమాండ్ అండ్ కంట్రోల యూనిట్లు సమగ్ర వైమానిక రక్షణను అందించడానికి ఉన్నాయని అన్నారు. ఈ పరీక్ష విజయవంతం భారతదేశం సాధించిన మరో మైలు రాయి అని అన్నారు.

## సురవరం రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శం!



**హైదరాబాద్, :** సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహానికి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాళి అర్పించారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌కు వెళ్లిన భట్టి.. సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలను డిప్యూటీ సీఎం గుర్తు చేసుకున్నారు. మనం ఓ గొప్ప నాయకుడిని కోల్పోయాం అని అన్నారు. చిన్న నాటి నుంచి ప్రజల పక్షాన నిలబడి.. ప్రజల కోసం పోరాడారన్నారు. సురవరం రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శం అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ 'గొప్ప నాయకుడిని కోల్పోయాం. సురవరం సుధాకర్ రెడ్డికి ఘనమైన నివాళులు అర్పిస్తున్నాను. విద్యార్థి దశ నుంచి ఆయన పోరాడారు. దేశంలో సీపీఐ బలోపేతం కోసం కృషి చేశారు. చిన్న నాటి నుంచి ప్రజల పక్షాన నిలబడి.. ప్రజల కోసం పోరాడారు. తను చివరి వరకు ప్రజల కోసం నిలబడ్డారు. వారి రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శం. సురవరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మా ముఖ్యమంత్రి చెప్పినట్టు కేబినెట్లో తీర్మానం చేసి వారు చిరస్థాయిగా నిలిచేలా నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు. సురవరం సుధాకర్ రెడ్డి పార్థివ దేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నివాళులర్పించారు. 'జాతీయ స్థాయిలో అనేక హోదాల్లో సుధాకర్ రెడ్డి పని చేశారు. ఎన్నో విప్ల ఉద్యమాలు, ఎన్నో ప్రజా ఉద్యమాల్లో, కార్మిక ఉద్యమాల్లో, తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. చిరస్మరినియమైన మహనీయుడు సురవరం సుధాకర్ రెడ్డి. సుధాకర్ రెడ్డి మరణం ఆవేదనకు గురిచేసింది. విద్యార్ది నాయకుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. జాతీయస్థాయిలో ఏడెండ్ల పాటు పని చేశారు.ప్రజల పట్ల.. ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో ఉన్నారు. అన్ని ప్రజా సమస్యలపై క్రియాశీలకంగా వ్యవహరించారు. ప్రజా ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఒక్కరికి బాధాకరం. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చి మద్దతు తెలిపింది. జాతీయ స్థాయిలో మాతో కలిసి పని చేసే అవకాశం కలిసి పని చేశారు. కేసీఆర్ కూడా సుధాకర్ రెడ్డి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. మా పార్టీ తరపున, కేసీఆర్ తరుపున సురవరం కుటుంబ సభ్యులకు ఘనమైన నివాళులు అర్పిస్తున్నాము' అని కేటీఆర్ తెలిపారు.

## ఆ 25 ఎకరాల టీటీడీ భూమిని టూరిజం శాఖకు ఎలా ఇస్తారు..?



**అమరావతి,:** అలిపిరి రోడ్డులోని రూ. 1500 కోట్లకు పైగా విలువ చేసే 25 ఎకరాల తిరుమల తిరుపతి దేవాస్థానం భూమిని టూరిజం శాఖకు ఎలా ఇస్తారు అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రశ్నించారు. టీటీడీ బోర్డు మీటింగ్ లో మా అభ్యంతరాలను తిరస్కరించారు.. దేవుడు భూమిని రక్షించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదా.. 25 ఎకరాల టీటీడీ ల్యాండ్ ను టూరిజం శాఖకు ఎందుకు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, టీడీపీ భూమిని టూరిజం శాఖకు ఇవ్వడాన్ని సీఎం చంద్రబాబు, బీఆర్ నాయుడు సమాధానం చెప్పాలి అని భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు టీటీడీ చరిత్రలో ఇలా జరగలేదు.. కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి.. వాణిజ్య అవసరాల కోసం దేవుడి భూమిని వాడుకుంటారా అని మండిపడ్డారు. మరి ఎక్కడైనా ప్రభుత్వ భూమిని టూరిజానికి ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. ఈ భూమిని ఒబెరాయ్ హొటల్ నిర్మాణం కోసం ఇస్తున్నారు.. దీన్ని వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు.

## చెత్త పన్ను వేసిన చెత్తను తొలగించని చెత్త ప్రభుత్వం వైసీపీ



**అమరావతి,:** మచిలీపట్నంలో లెగసీ వేస్ట్ డంపింగ్ యార్డును మంత్రి నారాయణ పరిశీలించారు. చెత్తను బయో మైనింగ్ చేస్తున్న విధానాన్ని మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు అదేశాలు ప్రకారం అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రంలో లెగసీ వేస్ట్ ను పూర్తిగా తొలగిస్తాం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 85 లక్షల లెగసీ వేస్ట్ ఉంది.. ఇప్పటి వరకూ 72 లక్షల టన్నుల చెత్తను తొలగించగా మరో 13 లక్షల టన్నుల చెత్త మిగిలి ఉంది.. మచిలీపట్నంలో మొత్తం 42 వేల టన్నుల చెత్తకు గాను 19 వేల టన్నులు పూర్తిగా తొలగించాం.. ఇక్కడ అదనంగా మెషీన్లు ఏర్పాటు చేసి త్వరితగతిన చెత్త తొలగించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పొంగూరు నారాయణ తెలిపారు. ఇక, గత ప్రభుత్వం అప్పులతో పాటు 85 లక్షల టన్నుల చెత్త కూడా వదిలి వెళ్ళిపోయిందని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. చెత్త పన్ను వేసినా చెత్తను తొలగించని చెత్త ప్రభుత్వం వైసీపీది అని మండిపడ్డారు. ప్రజలకు రోగాలకు కారణమయ్యే ఘన,ద్రవ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా ప్లాంట్ లు ఏర్పాటు చేస్తున్నాం.. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా సీఎం చంద్రబాబు చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.. రాష్ట్రంలో ప్రతి రోజూ వచ్చే 7500 టన్నుల సాలిడ్ వేస్ట్ కోసం వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల్ ఏర్పాటు చేస్తున్నాం.. ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం రాబోయే రెండేళ్లలో వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ లు ఏర్పాటు చేస్తున్నామని నారాయణ వెల్లడించారు.

# గవర్నర్లు విధి నిర్వహణలో గాడి తప్పితే..



గవర్నర్ల విధులుపై మళ్లీ సుప్రీం కోర్టులో విచారణ ప్రారంభమైంది. బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి, గవర్నర్లకు నిర్దిష్ట గడువును సుప్రీం కోర్టు విధించ వచ్చా? అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143 (1) అధికరణ కింద సర్వోన్నత న్యాయస్థానాన్ని అభిప్రాయం కోరడంపై ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గురువారం కూడా తన విచారణ కొనసాగించింది. ఈ విచారణలో రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లులను ఎలాంటి కారణం లేకుండా కొన్నేళ్లపాటు గవర్నర్లు నిలిపివేస్తే ఏం చేయాలి? అన్న సమస్యపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. గవర్నర్ బిల్లులు నిలిపివేస్తే ముఖ్యమంత్రి కోర్టును ఆశ్రయించకుండా గవర్నర్‌తో చర్చలు జరపవచ్చని, ప్రధాని, రాష్ట్రపతిని కూడా కలిసి పరిష్కారాలు కనుక్కోవచ్చని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదన వినిపించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు అకారణంగా తమ విధులు నిర్వహించకపోతే కోర్టులు చేతులు కట్టుకుని కూర్చోవాలా? అని ధర్మాసనం ప్రశ్నించింది. బిల్లుల ఆమోదానికి గవర్నర్‌కు, రాష్ట్రపతికి రాజ్యాంగంలో ఎక్కడా నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించలేదని మెహతా తెలియజేశారు. అయితే తప్పు జరిగినప్పుడు దిద్దుబాటు ఉండాల్సిందేనని, సుప్రీం కోర్టు రాజ్యాంగ పరిరక్షకురాలని సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ స్పష్టంచేశారు. ఈ సమస్యపై మళ్లీ 26న విచారణ జరగనుంది. కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు, ముఖ్యమంత్రుల మధ్య సంఘర్షణ వైఖరి కొనసాగుతుండడం పాలనా వ్యవహారాలకు ప్రతిబంధకమవుతోంది. కేరళ, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలకు రాజకీయ ప్రత్యర్థులుగా గవర్నర్లు వ్యవహరించడం చివరకు సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని గవర్నర్ల వైఖరిని తప్పుపట్టడం తెలిసిందే. శాసనసభ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపినప్పుడు దానిని తాను సమ్మతిస్తున్నానని లేదా సమ్మతిని నిలిపివేస్తూ రాష్ట్రపతి పరిశీలనకు పంపిస్తున్నానని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయడం గవర్నర్ బాధ్యత. ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని తెలియజేస్తూ తిరిగి శాసనసభకు పునఃపరిశీలనకు పంపడం తప్పనిసరి. అదే బిల్లును సవరణతో శాసనసభ ఆమోదించి పంపితే గవర్నర్ వెంటనే ఆమోదించక తప్పదు. రాజ్యాంగ పరమైన ఈ ప్రక్రియకు విరుద్ధంగా గవర్నర్లు తమ బిల్లులను ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారని, అభ్యంతరాలుంటే తమకు తెలియజేయడం లేదని, రాష్ట్రపతి పరిశీలన కోసం పంపడం లేదని ఆరోపిస్తూ తమిళనాడు, కేరళ, పంజాబ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. వీటన్నిటిలో తమిళనాడు గవర్నర్ వ్యవహారం అత్యంత వివాదాస్పదమైంది. శాసనసభ పంపిన బిల్లులను ఎలాంటి పరిశీలన చేయకుండా, మూడేళ్లుగా గవర్నర్ తనవద్దే అట్టే పెట్టుకోవడం వివాదాలకు దారి తీసింది. ఈ వివాదంపైనే సుప్రీం కోర్టు బిల్లుల ఆమోదానికి గవర్నర్‌కు, రాష్ట్రపతికి గడువు నిర్దేశిస్తూ తీర్పు వెలువరించడం సంచలనం కలిగించింది. ఇది రాజ్యాంగపరమైన రగడగా మారి విచారణ సాగుతోంది. గతంలో కూడా తమిళనాడు ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య విభేదాలు తలెత్తి ప్రతిష్టంభన ఏర్పడిన సంఘటనలు ఉన్నాయి. గవర్నర్లు కొందరు గాడితప్పి నడుస్తున్నా లేదా రాజ్యాంగానికి అతీతులుగా వ్యవహరిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. తమ ప్రభుత్వాలు లేని రాష్ట్రాలను గవర్నర్లు ముప్పుతిప్పలు పెట్టడం కేంద్ర ప్రభుత్వానికి ఆనందం కలిగిస్తోందన్న అనుమానాలు కలుగుతున్నాయి. అంతేకాదు పరోక్షంగా ఆయా గవర్నర్లకు వత్తాసు పలుకుతున్నారేమో అన్న ప్రశ్నలు వస్తున్నాయి. గవర్నర్ అంటే ఒక రాష్ట్రానికి రాజ్యాంగ అధిపతి. కేంద్ర స్థాయిలో రాష్ట్రపతికి ఉన్న అధికారాలు, విధులు రాష్ట్ర స్థాయిలో గవర్నర్‌కు ఉంటాయి. అయినాసరే ముఖ్యమంత్రి, మంత్రిమండలి సలహాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం రాజ్యాంగ విధి. అయితే కేంద్రం లోను, రాష్ట్రాల్లోను వివిధ రాజకీయ వ్యవస్థలు పాలించడం ప్రారంభం కావడంతో రాజ్యాంగపరంగా అనుసరించాల్సిన విధానాలు గాడి తప్పుతున్నాయి. 1935 నాటి చట్టం ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వం ఆనాడు గవర్నర్లకు విపరీతమైన అధికారాలను కట్టబెట్టింది. బ్రిటిష్ ప్రభుత్వ ఏజెంట్లుగా అప్పటి గవర్నర్లు వ్యవహరించేవారు. ఆ పోకడ ఇప్పటికీ కొంతమంది గవర్నర్లలో కనిపిస్తుండడంతో వివాదాలు తలెత్తుతున్నాయి. గతంలో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా రామ్‌లాల్ ఉన్నప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్‌ను కాదని నాదెండ్ల భాస్కరావును ముఖ్యమంత్రి స్థానంలో రాజ్యాంగ విరుద్ధంగా కూర్చోబెట్టడం ఎంతటి ఆందోళనలకు దారి తీసిందో తెలిసిందే. ఇలాంటి సంఘటనల వల్ల గవర్నర్లు కేంద్రానికి ఏజెంట్లా? అన్న ప్రశ్న తలెత్తక మానదు. కేంద్ర ప్రభుత్వం నియమించిన గవర్నర్లు ప్రజలకు జవాబుదారీ అవుతారా?అలాగే వారికి శాసనాధికారాలు ఉంటాయా? అన్నది ఆత్మపరిశీలన చేసుకోవాలి. వారికి ఉండే అధికారాలన్నీ శాసనసభ ఆమోదించిన బిల్లులను పరిశీలించి తీర్పు ఇవ్వడమే. ఈ అంశాలనే సుప్రీం కోర్టు ధర్మాసనం ప్రశ్నిస్తోంది. గవర్నర్లు రాజ్యాంగబద్ధంగా తమకు సంక్రమించిన విధులను నెరవేర్చవలసిన బాధ్యత ఉందని సూచిస్తోంది. ఆ బాధ్యత సక్రమంగా నెరవేరనప్పుడు న్యాయస్థానం జోక్యం చేసుకోవడం తప్పవుతుందా? రాజ్యాంగాన్ని రక్షించవలసిన ధర్మస్థానం చేతులను కట్టిపడేస్తారా అని ప్రశ్నిస్తోంది. గవర్నర్లకు, అధికారపక్షానికి ముఖ్యంగా ముఖ్యమంత్రికి, మంత్రి మండలికి మధ్య వ్యక్తిగత విభేదాలు, వ్యవస్థాపరమైన సంఘర్షణలు చిలికిచిలికి గాలివానలా చెలరేగిపోతుండటం ఎవరికీ మంచిది కాదు. రాజ్యాంగ ప్రతినిధులు రాజకీయ రగడగా మారకూడదని రాజకీయ, న్యాయ నీతిజ్ఞులు సూచించడంలో తప్పులేదు.

# పెన్షనర్లపై చిన్నచూపు తగదు

దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల భవితవ్యం ప్రమాదపుటంచులపై ఉంది. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న చట్టాలు ఉద్యోగులు, పెన్షనర్ల భద్రతపై కత్తిలా వ్రేలాడుతున్నాయి. ఇప్పటికిప్పుడు ప్రమాదం లేకపోయినా ప్రమాదపు అంచులపై కాలం నడక తప్పడంలేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదం పొందిన 'ఫైనాన్షియల్ బిల్లు- 2025' పెన్షనర్ల పాలిట శాపంగా మారింది. ఆ బిల్లులో స్పష్టంగా లోక్ మత్ కమిషన్ చేసిన పెన్షనర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ఉపసంహరించుకోవాలన్న సూచనలు పొందుపరిచారు. కనుక 2026లో బిల్లు ఆచరణలోకి వచ్చే నాటినుండి పెన్షనర్ల పదవీ విరమణ బెనిఫిట్స్‌కు సర్వమంగళం పాడినట్లే? ఇదిలా ఉండగా ఆ బిల్లులోనే పెన్షనర్ల భద్రతకు సంబంధించిన అంశాలకు, సంబంధించి పెన్షన్ పెంపుదలపై ప్రభుత్వం అనుమతుల మేరకు అనే వాక్యం చేర్చడం వలన పెరిగే కరువు భత్యం, వేతన సవరణలు వర్తింపజేయడం ఆయా ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలకు వదిలివేయడం జరిగింది. అటూ, ఇటూ కాని స్పష్టత లేని వాక్యాలు చట్టంలో మర్మగర్భితంగా చేర్చడం వలన ఆయా ప్రభుత్వాలు పెన్షనర్లకున్న హక్కును లాగేసుకునే ప్రమాదం సైతం పొంచి వుంది. ఇదిలా ఉండగా ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో 2014, ఏప్రియల్ నుండి రిటైర్ అయిన 8 వేల మంది రిటైర్మెంట్ పొందిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ 16 లక్షల గ్రాడ్యుయేటీతోపాటు, పెన్షన్ కమిటేషన్, దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్, ఎర్నడ్ లీవు ఎన్‌క్యాస్‌మెంట్ సొమ్ములు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో పెట్టింది. రిటైర్ ఉద్యోగుల ఈ బకాయిల మొత్తం రూ. 9 వేల కోట్లు పైమాటే నని ఒక అంచనా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ బకాయిలు ఎప్పుడు మంజూరు చేస్తుందోనని రిటైర్ ఉద్యోగులు ఏడాదిన్నర కాలంగా ఎదురు చూస్తున్నారు. 1982లో సుప్రీం కోర్టు రిటైర్ ఉద్యోగి డియస్ నకాలి కేసులో పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే దయాదాక్షిణ్యం కానేకాదు. ఉద్యోగుల గత సేవలను దృష్టిలో ఉంచుకొని పెన్షన్ పొందే హక్కు వారికి సంక్రమిస్తుందని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతోపాటు, ఉద్యోగులతో సమానంగా కరువు భత్యం, పే కమిషన్ పెన్షన్లు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఆ తీర్పు ఇచ్చిన రోజునే డిసెంబర్ 17నే దేశవ్యాప్తంగా రిటైర్ ఉద్యోగులు పెన్షన్ దేగాజరుపుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పెన్షనర్ల గురించి సానుభూతితో ఆలోచించే స్థితి కనిపించడం లేదు. ఇక పోతే మరో పిడుగులాంటి సమాచారం ఏమంటే! ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన ఆత్మీయ మిత్రుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులను అర్ధాంతరంగా తొలగించే హక్కును చట్టంగా చేయబోతున్నట్లు సమాచారం ఉంది. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ అధికారంలోకి రాగానే ఆర్థిక స్థిరత్వం పేరుతో లక్షలాది మంది ఉద్యోగులను తొలగించారు. ప్రపంచ దేశాలపై ఇబ్బడి ముబ్బడిగా పన్నులు వేశారు. ఇదే బాటలో మన నరేంద్ర మోడీ కొందరు పనిచేయని ఉద్యోగులను, మరికొందరు అవినీతిపరులైన ఉద్యోగులను, రెడ్ టేపిజం ప్రదర్శించి ప్రజలను చులకనగా చూసే ఉద్యోగులపై వేటు వేసే పేరుతో రాజ్యాంగ చట్టంలోని ఆర్టికల్ 311ను సవరించనున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 311(1) అనేది ఉద్యోగిని అర్ధాంతరంగా డిస్మిస్ చేయడాన్ని లేదా తొలగించడాన్ని, ర్యాంకు తగ్గించడంలో ప్రభుత్వ చర్యలనుండి భద్రత కల్పిస్తుంది. ఇక ఆర్టికల్ 311 (2) నిబంధనలు కేవలం క్రిమినల్ కేసులో శిక్షపడ్డప్పుడు, మరికొన్ని తీవ్రమైన సందర్భాల్లో చర్యలు తీసుకోవడం, అది ఉద్యోగికి సమాచారం ఇచ్చి, సంజాయిషీ చెప్పుకునే అవకాశం ఇచ్చి మాత్రమే సంబంధిత ఉద్యోగిని తొలగించే అవకాశం ఉంటుంది. రాజ్యాంగంలో ఉద్యోగులకు భద్రత కల్పిస్తున్న 311 ఆర్టికల్‌లో సవరణ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఉంది. ఇదే జరిగితే దేశవ్యాప్తంగా ఉన్న 4.5 కోట్లమంది ఉద్యోగుల ఉద్యోగభద్రత ప్రమాదంలో పడినట్లే? అంటే ఈ సంఖ్య దేశ జనాభాలో 3% ఉంటుంది. రాజ్యాంగ చట్టం తయారు చేసిన నాడు ప్రభుత్వంలో ఉద్యోగుల పాత్ర చాలా కీలకం అయినది. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ పరిపాలనలో ఉద్యోగులు పరిస్థితి ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేది. నిర్దాక్షిణ్యంగా, అర్ధాంతరంగా ఉద్యోగులను తొలగించే వారు. ఆ స్థితినుండి మన ఉద్యోగులకు రక్షణ కల్పించేందుకు స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ ముసా యిదాలోనే అంబేద్కర్ ఉద్యోగ భద్రత, ప్రభుత్వాల నుండి రక్షణ కల్పించారు.

ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు రావడంతో కాగితాలు బదులు కంప్యూటర్ పరిజ్ఞానం అందుబాటులోకి రావడం, ఐటి లాంటి రంగాల్లో ప్రైవేటు ఉద్యోగాలు అవకాశంగా రావడం, అటు తర్వాత రెగ్యులర్ నియామకాలకు బదులు ఔట్‌సోర్సింగ్ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఉద్యోగుల ప్రాధాన్యత తగ్గింది. ఉద్యోగులు కూడా చాలా సందర్భాల్లో చాలా మంది ఉద్యోగులు తమ చేతిలో ఉన్న అధికారం దుర్వినియోగం చేయడం, కొందరు అదే పనిగా అవినీతి రూపాలుగా తమ సేవలను మార్చడం, ప్రజాసేవకులుగా కాకుండా తామేదో ప్రత్యేక వర్గం అన్న భావనలు కొందరు ఉద్యోగుల్లో ఏర్పడి ప్రజలతో సత్సంబంధాలు కోల్పోయిన స్థితి ఉంది. అదే సమయంలో రిటైర్మెంట్ పొందిన ఉద్యోగుల స్థానంలో ఖాళీలు భర్తీ చేయకపోవడం సైతం ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య క్రమానుగతంగా తగ్గిపోయోలా చేసింది. ప్రైవేటు రంగంలో పని చేయని ఉద్యోగులను, పని ఇవ్వలేని ఉద్యోగులను బెంచిపై నుంచి తొలగించే విధానాలు చూసిన పాలకుల్లో తమకు అలాంటి అధికారం ఉండాలనే వాంఛలు ఆధునిక ప్రభుత్వాలకు కలుగుతున్నాయి. ఇప్పటి ఉద్యోగులు పని విధానం కూడా చాలా మారింది. గతంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ పని తాము నిబంధనలు, నియమాలు అనుసరించి చేసుకుపోయో వారు. కానీ మారుతున్న రాజకీయ చక్రబంధంలో ఉద్యోగులు పాలకుల చెప్పుచేతల్లో పనిముట్లుగా మారడంతో ఇప్పుడు ఉద్యోగులు పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. దానివలన ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధాన కర్తలుగా ఉండాల్సిన ఉద్యోగుల గౌరవం, వృత్తి నిబద్ధత క్రమంగా క్షీణించాయి. ఫలితంగా ప్రజలకు, ప్రభుత్వాలకు కొరగాకుండాపోయో విచిత్రమైన స్థితి ఏర్పడింది. ఇప్పుడు ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా ఆర్టికల్ 311 ప్రకారం సంక్రమించిన హక్కులను తొలగిస్తున్నా, సవరిస్తున్నా కనీసం స్పందనలేని స్థితి నెలకొంది. ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న చట్టాల్లో మార్పుల్లో లేదా సవరణల్లో ఆర్టికల్ 311 కూడా ఒకటి కావడం పెద్ద విశేషం ఏమీ కాదు? ఇదే జరిగితే ప్రైవేటు ఉద్యోగుల మాదిరిగా ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేనట్లే! అంతేకాదు నిరంకుశ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు ఉద్యోగులను వారి చేతిలో పావులుగా మార్చుకోవడానికి సైతం ఈ చట్టసవరణ తోడ్పడే ప్రమాదం కూడా ఉంది. కనుక ప్రభుత్వ ఉద్యోగులలో మార్పు రావడంతో పాటు, ఇలాంటి చట్టాలను సమైక్యంగా ఉద్యోగులు ఎదుర్కొనడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఉద్యోగ వ్యవస్థకు మేలు చేసిన వారవుతారు. ప్రభుత్వాలు కూడా ఉద్యోగులు హక్కులను, రాజ్యాంగ స్ఫూర్తితో ఆలోచించి మాత్రమే చట్ట సవరణలకు పోవాల్సి ఉంటుంది.

# 'కేదార్‌నాథ్' నిర్మాతలు కోయరాజులే!




భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ అత్యంత కీలకమైనది. ప్రతి ఓటరూ తన హక్కును వినియోగించుకోవడం ద్వారా దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాడు. అయితే, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది 'ఓటు చోరీ' లేదా 'ఓట్ల దొంగతనం'. ఈ అంశంపై ఇటీవల భారత ఎన్నికల కమిషన్, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మధ్య జరిగిన వాదోపవాదాలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చలకు దారితీశాయి. ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడు, ఒక ప్రభుత్వ సంస్థ మధ్య జరిగిన మాటల యుద్ధం మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో లోపాలు, విశ్వసనీయతపై ప్రజల్లో ఉన్న సందేహాలకు అద్దం పడుతుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, కొన్ని ఎన్నికల్లో 'ఓటు చోరీ' జరుగుతోందని తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల వెనుక ఇవిఎంల (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు) పనితీరుపై సందేహాలు, ఓటర్ల జాబితాలో లోపాలు, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఈ ఆరోపణలను భారత ఎన్నికల కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల కమిషన్, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహిస్తోందని, రాహుల్ గాంధీ వ్యాఖ్యలు తమ విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొంది. ఎన్నికల కమిషన్ ఒక కీలకమైన స్వతంత్ర సంస్థ. దానిపై ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు ఈ విధంగా అనుమానాలు వ్యక్తం చేయడం ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తుందని కమిషన్ స్పష్టం చేసింది. అంతేకాకుండా ఇలాంటి ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థకు హానికరం అని అభిప్రాయపడింది. రాహుల్ గాంధీ ఆరోపణలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే చేశారని కొందరు విమర్శిస్తున్నారు. అయితే, ఆయన వాదనలో కొంత సత్యం లేకపోలేదు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం లేకపోతే అది ప్రజాస్వామ్యానికి ప్రాథమిక సవాలుగా మారుతుంది. రాహుల్ గాంధీ తన ప్రసంగాల్లో 'ప్రజలు తమ ఓట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అసలు సమస్యలపై సరైన దృష్టి పెట్టాలని' సూచించారు. అంటే, ప్రజలు ఎన్నికల ప్రక్రియలో మరింత చురుకుగా పాల్గొనాలి, తమ హక్కులను తెలుసుకోవాలి అని ఆయన చెప్పిన మాటలకు అర్థం. ప్రజాస్వామ్యం అనేది కేవలం ఓటు వేయడం మాత్రమే కాదు, అది ఒక సంపూర్ణ ప్రక్రియ. అందులో ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ సంస్థలు ఒకరికొకరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రాజకీయ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తారు. అదే సమయంలో వారు బాధ్యతారహితంగా మాట్లాడకూడదు. ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యానికి ఒక సంరక్షకుడిగా వ్యవహరిస్తుంది. ప్రజల ఓట్లను కాపాడటం, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం దాని ప్రధాన బాధ్యత.

రాహుల్ గాంధీ వంటి రాజకీయ నాయకులు చేసిన ఆరోపణలను ఎన్నికల కమిషన్ తేలికగా తీసుకోకూడదు. ఆ ఆరోపణల్లో నిజం ఉందా లేదా అని సమగ్రంగా విచారించాలి. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచడానికి చర్యలు తీసుకోవాలి. ఇవిఎంలలో లోపాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్నప్పుడు, వివిప్యాట్ స్లిప్పుల లెక్కను పెంచడం లేదా ఇవిఎంల పనితీరుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలి. ఓటరు జాబితాలో లోపాలు, నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తికి అనేక ఓట్లు వంటి సమస్యలను పరిష్కరించాలి. ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందడానికి ఎన్నికల కమిషన్ తన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలి. రాజకీయ నాయకులు తమ విమర్శలను బాధ్యతాయుతంగా చేయాలి. వ్యవస్థలో లోపాలు ఉన్నప్పుడు వాటిని ఎత్తిచూపాలి. కానీ ఆ వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా మార్చడానికి ప్రయత్నించాలి. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థను బలహీనపరచడం, ప్రజల్లో అపనమ్మకం పెంచడం మంచిది కాదు. అదే సమయంలో ప్రజలు కూడా తమ హక్కుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని పెంచడానికి ప్రజలు చురుకుగా పాల్గొనాలి. ప్రతి ఒక్కరూ తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి. ఓటరు జాబితాను తనిఖీ చేసుకోవాలి. ఎన్నికల నియమావళి గురించి తెలుసుకోవాలి. ఓటు చోరీ అనే అంశంపై రాజకీయ నాయకులు, ఎన్నికల కమిషన్ మధ్య జరిగిన ఈ వాదోపవాదాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక హెచ్చరిక. ఈ సమస్యను పరిష్కరించడానికి కొన్ని చర్యలు తీసుకోవాలి. ఎన్నికల కమిషన్ మరింత పారదర్శకంగా వ్యవహరించాలి. ఇవిఎంల పనితీరు, ఓటరు జాబితా తయారీ వంటి అంశాలపై ప్రజలకు పూర్తి వివరాలు అందించాలి. రాజకీయ నాయకులు తమ వ్యాఖ్యలను బాధ్యతాయుతంగా చేయాలి. ప్రజా అవగాహన కార్యక్రమాలను పెంచాలి. ప్రజలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలి. ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలి. ఎన్నికల నిబంధనలను మరింత కఠినంగా అమలు చేయాలి. ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలను నివారించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఓటు చోరీ అనే ఆరోపణలపై ఎన్నికల కమిషన్, రాహుల్ గాంధీ మధ్య జరిగిన ఈ వివాదం భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న అంతర్గత సవాళ్లను వెలుగులోకి తెచ్చింది. ఈ వివాదం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుని ఆగిపోకూడదు. ఇది ఒక సంభాషణకు దారితీయాలి. రాజకీయ నాయకులు, ఎన్నికల కమిషన్, ప్రజలు కలిసి పనిచేస్తేనే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉంటేనే, దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. రాజకీయ నాయకులు బాధ్యతాయుతమైన వ్యాఖ్యలు, ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతమైన కార్యాచరణ, ప్రజల చైతన్యం ఈ దేశ ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా నిలవాలి.

శుభోదయం
సంపాదకీయం

# ఈసారి 'మహా' వంతు!

## (విశ్లేషణ)

ఏదేమైనా హిందీని అందరికీ నేర్పించి తీరాలన్న సంకల్పం ఎలాంటి మలుపులు తిరుగుతుందో మహారాష్ట్రలో తాజాగా రాజుకుంటున్న వివాదాన్ని చూసైనా బీజేపీ తెలుసుకోవాలి. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కావొచ్చు... దూకుడు ప్రదర్శిస్తున్న బీజేపీని ఇరకాటంలో పెట్టాలని కావొచ్చు హిందీని బలవంతంగా రుద్దే విధానాన్ని అంగీకరించబోమని ప్రకటించి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దక్షిణాదిన దుమారం రేపారు. స్థానిక భాషతోపాటు ఇంగ్లిష్, మరేదైనా భాష ప్రాథమిక స్థాయిలో తప్పనిసరి చేసే నూతన విద్యావిధానాన్ని కేంద్రం తీసుకొచ్చిన నేపథ్యంలో స్టాలిన్ దాన్ని తప్పుబట్టారు. అదింకా పూర్తిగా చల్లారక మునుపే మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకూ మూడో భాషగా హిందీని తప్పనిసరి చేయటమే ఆ నిర్ణయం సారాంశం. ఇంతవరకూ ప్రాథమిక స్థాయిలో తప్పనిసరి భాషలు మరాఠీ, ఇంగ్లిష్ మాత్రమే. కానీ జాతీయ విద్యావిధానం చెబుతున్నట్టు 'ఏదైనా మరో భాష' కూడా తప్పనిసరి గనుక హిందీని ఆ రెండింటితో జత చేశామని ప్రభుత్వం అంటున్నది. సహజంగానే మహారాష్ట్రలో ఇది వివాదాన్ని రేకెత్తించింది. 'మేం హిందువు లమేగానీ... హిందీ అవసరం లేద'ంటూ మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) ముంబై నగరంలో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు పెట్టింది. నిజానికి ఎంఎన్ఎస్ అయినా, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) అయినా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయంగా అయోమ యంలో పడ్డాయి. ఎంఎన్ఎస్ ఏర్పడి ఇరవయ్యేళ్లు కావొస్తున్నా ఇంతవరకూ ఆ పార్టీ అసెంబ్లీలోకి అడుగుపెట్టలేకపోయింది. యూబీటీగా చీలకముందు శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే కాంగ్రెస్, ఎన్సీపీలతో కూటమి ప్రభుత్వాన్ని నడిపారు. కానీ ఏక్‌నాథ్ షిండే రూపంలో వచ్చిపడిన విపత్తుతో పార్టీ నిలువునా చీలిపోవటమే కాక, అధికారాన్ని కూడా కోల్పోయింది. జనం సానుభూతి చూపిస్తా రనుకుంటే అదీ జరగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నిండా ఆర్నెల్లు కాలేదు. కనుక విపక్షాలు ఏం చేయటానికీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మహారాష్ట్ర సర్కారు విపక్షాలకు ఆయుధాన్ని అందించింది. తమిళనాడులో స్టాలిన్ హిందీ వివాదాన్ని రేకెత్తించినప్పుడు కేంద్రం తన విధానాన్ని గట్టిగా సమర్థించుకుంటూ ఒక మాట చెప్పింది. మూడో భాషగా హిందీయే నేర్పాలని తాము పట్టుబట్టడం లేదని, దేశ భాషల్లో దేన్నయినా ఎంపిక చేసుకోవచ్చని అన్నది. కానీ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇస్తున్న వివరణ చూస్తే అందుకు భిన్నంగావుంది. నూతన విద్యావిధానంలో భాగంగా స్థానిక భాష, ఇంగ్లిష్‌తోపాటు హిందీని కేంద్రం తప్పనిసరి చేసిందని, దాన్నే తాము అమలు చేస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. ఈ వివరణ సహజంగానే తమిళనాడులో పాలక డీఎంకేకు అందివచ్చింది. మూడో భాషగా 'మరేదైనా' నేర్చుకోవచ్చన్న నిబంధన అంతర్యమేమిటో మహా రాష్ట్ర నిర్ణయం బట్టబయలు చేసిందని ఆ పార్టీ అంటున్నది. దేశంలో హిందీని ఏదో విధంగా దొడ్డిదోవన అనుసంధాన భాషగా చేయాలన్నదే కేంద్రంలోని ఎన్డీయే పాలకుల ఉద్దేశమని విమర్శి స్తోంది. యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా కేంద్రంనుంచి ఇలాంటి ప్రయత్నాలే జరిగాయి. వాటిని ఎప్పటికప్పుడు దక్షిణాది రాష్ట్రాలు, మరీ ముఖ్యంగా తమిళనాడు వ్యతిరేకిస్తూనే వచ్చాయి. తమిళనాడు మాదిరే మహారాష్ట్రలో కూడా భాషాభిమానం బాగా ఎక్కువ. దాన్ని అన్నివిధాలా ఉపయోగించుకుందామని ఠాక్రే సోదరులు భావిస్తున్నట్టు కనబడుతోంది. సొంత అన్నదమ్ములు కాకపోయినా ఇద్దరూ శివసేనలో కలిసి పనిచేసేవారు. **2005**లో వారిమధ్య పొరపొచ్చాలు బయల్దే రాక పార్టీ అధినేత బాల్ ఠాక్రే ఇద్దరి మధ్యా రాజీకి ప్రయత్నించారు. కానీ అది ఫలించలేదు. **2006**లో రాజ్ ఠాక్రే ఎంఎన్ఎస్ స్థాపించారు. మొదట్లో యూపీ, బిహార్‌లనుంచి వలస వచ్చేవారి వల్ల స్థానికుల ఉపాధి దెబ్బతింటున్నదని, వారు దాదాగిరీ చలాయిస్తున్నారని ఆరోపిస్తూ నడిపిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. ఆ తర్వాత దుకాణాల బోర్డులన్నీ మరాఠిలో ఉండాలంటూ సాగించిన ఉద్యమం కూడా ఆ తోవలోనే నడిచింది. ఇవిగాక మరాఠీ ఆత్మగౌరవం పేరిట చాలా ఉద్యమాలు నడిపినా రాజ్ ఠాక్రేకు కలిసిరాలేదు. ఇప్పుడు బలవంతంగా హిందీ రుద్దుతున్నారన్న అంశంపై సాగించే ఉద్యమానికి స్పందన ఏమాత్రం వస్తుందన్నది చూడాలి. మహారాష్ట్రకు రావా ల్సిన ప్రాజెక్టులను గుజరాత్‌కు తన్నుకుపోవటాన్ని తప్పుబడుతూ నిరుడు లోక్‌సభ ఎన్నికల సమ యంలో తాను నిలదీసినప్పుడు రాజ్ కలిసిరాలేదని, అదే జరిగుంటే ఇవాళ కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఉండేది కాదని ఉద్ధవ్ వాదన. తమ మధ్య కేవలం చిన్న చిన్న అపోహలు మాత్రమే ఉండే వని ఉద్ధవ్ అంటుంటే... అసలు సోదరులిద్దరూ విడిపోయిందెక్కడని యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి ఠాక్రే సోదరుల ప్రకటనలు వారిద్దరూ మళ్లీ కలిసి పనిచేయబోతు న్నారన్న సంకేతాలిస్తున్నాయి. అది బీజేపీ మనుగడను దెబ్బతీస్తుందా లేదా అన్నది చూడాలి. అయితే పాలకులు మేల్కొనాల్సిన సమయం వచ్చింది. **1963** నాటి అధికార భాషల చట్టం, దానికి **1967**లో తీసుకొచ్చిన సవరణలు గమనించి మసులుకుంటే భాషా వివాదం తలెత్తదు. అధి కార లావాదేవీలన్నిటా ఇంగ్లిష్, హిందీ వినియోగించాలని, హిందీ మాతృభాషగా లేని రాష్ట్రాలతో ఇంగ్లిష్‌లోనే ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించాలని చట్టం స్పష్టంగా చెబుతున్నప్పుడు అందరూ హిందీ నేర్చుకు తీరాలని శాసించటం సరికాదు. దేశ సమైక్యత, సమగ్రత పేరిట దాన్ని తలకెత్తుకుంటే అందుకు విరుద్ధమైన ఫలితాలొస్తాయి. మహారాష్ట్ర పరిణామాలు ఆ సంగతిని చాటుతున్నాయి.

# భూగోళం.. కారాదు అగ్నిగోళం




ప్రపంచ ధరిత్రి దినోత్సవం పర్యావరణ పరిరక్షణకు మద్దతును ప్రదర్శించడానికి ఏప్రిల్ 22న జరిగే ప్రపంచ వార్షిక కార్యక్రమం. ఇది మొదటిసారి ఏప్రిల్ 22, 1970న నిర్వహించబడింది, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఎర్త్‌డే.ఆర్గ్ ద్వారా 193 కంటే ఎక్కువ దేశాల్లోని 1 బిలియన్ మంది వ్యక్తులతో సహా అనేక రకాల కార్యక్రమాలు జరుగుతున్నాయి. 1969లో శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన యునెస్కో సమావేశంలో, శాంతి కార్యకర్త జాన్ మెక్‌కానెల్ భూమిని, శాంతిభావనను గౌరవించే రోజును ప్రతిపాదించాడు. దీనిని మొదట మార్చి 21, 1970న, ఉత్తర అర్ధగోళంలో వసంతకాలం మొదటి రోజున పాటించాలని ప్రతిపాదించారు. ఐక్యరాజ్యసమితిలో సెక్రటరీ జనరల్ యు థాంట్ సంతకం చేసారు. ఒక నెల తర్వాత, యునైటెడ్ స్టేట్స్ సెనెటర్ గేలార్డ్ నెల్సన్ ఏప్రిల్ 22, 1970న దేశవ్యాప్త పర్యావరణ బోధనను నిర్వహించాలనే ఆలోచనను ప్రతిపాదించారు. నెల్సన్, హేస్ ఈ కార్యక్రమానికి ధరిత్రి దినోత్సవం (ఎర్త్ డే) అని పేరు పెట్టారు. 2025 ప్రపంచ భూమి దినోత్సవం అధికారిక సారాంశం 'మనశక్తి, మనగ్రహం'. ఇది పునరుత్పాదకశక్తికి మారడం, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడం అనే సమష్టి బాధ్యతపై దృష్టి పెడుతుంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే పునరుత్పాదక శక్తి మొత్తాన్ని మూడురెట్లు పెంచడం, ముఖ్యంగా సౌర, పవన భూఉష్ణ వంటి శుభ్రమైన వనరులను నొక్కి చెప్పడం ముఖ్య లక్ష్యం. జీవుల మనుగడకు అనుకూలమైన గ్రహం భూమి. కానీ అది చాలా సమస్యలను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల కారణంగా నాసా ప్రకారం, భూమిపై గ్లోబల్ వార్మింగ్ సగటు ఉపరితల ఉష్ణోగ్రత 59 డిగ్రీల ఫారెన్‌హీట్ (15 డిగ్రీల సెల్సియస్) వద్ద ఉంది. గాలి, నీరు, నేల, ధ్వని కాలుష్యాలు పెరుగుతున్నాయి. 1970 నుండి జీవవైవిధ్య నష్టం 73%గా ఉంది. సంవత్సరానికి 10 మిలియన్ హెక్టార్లలో అటవీ నిర్మూలన జరుగుతోంది. పెరుగుతున్న మానవ జనాభా, పెరుగుతున్న వినియోగం సహజ వనరులపై అపారమైన ఒత్తిడిని కలిగిస్తుంది, ఇది నీటి కొరత, ఆహార అభద్రత, ఆవాసాల నాశనానికి దారితీస్తుంది. మరోవైపు, ప్లాస్టిక్‌ల ఉత్పత్తి, పారవేయడం మహాసముద్రాలు, పల్లపు ప్రాంతాలు, పర్యావరణ వ్యవస్థలలో కాలుష్యానికి, వన్యప్రాణులకు, ఆహార గొలుసులకు అంతరాయం కలిగిస్తుంది. 1970ల చివరి నుండి, ఓజోన్ స్థాయిలు సగటున 4% తగ్గాయి. ప్రపంచవ్యాప్తంగా, జనాభాలో గణనీయమైన భాగం నీటి కొరతను అనుభవిస్తోంది. దాదాపు 25% మంది నీటిఒత్తిడి, కొరతను ఎదుర్కొంటున్నారు. 2025 నాటికి, ప్రపంచ జనాభాలో మ%8

# దండకారణ్యంలో ఆగని హత్యాకాండ



'హింస ద్వారా హింసను ఎప్పటికీ ఆపలేరు. ప్రేమ ద్వారా మాత్రమే హింసను జయించగలం. ఇది శాశ్వతమైన సత్యం' అని బుద్ధుడు అన్నారు. 'ప్రజలే అసలైన హీరోలు, అయితే వారిని అణచివేస్తే తిరుగుబాటు తప్పదు' అని మావో అన్నారు. ఇద్దరి మాటలూ అహింస, ప్రేమ, శాంతి మార్గమే మానవ మనుగడకు అనుసరణీయమని చెబుతున్నాయి. ఆది వాసీల జల్, జంగల్, జమీన్, ఇజ్జత్‌ల కోసం మావోయిస్టులు చేస్తున్న పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అత్యంత దారుణంగా అణచివేస్తోంది. 'ఆపరేషన్ కగార్' పేరుతో అది సాగిస్తున్న సైనిక చర్యతో దండకారణ్యం అగ్నిగుండంలా రగులుతోంది. ఎన్‌కౌంటర్లు, వాయుసేన దాడులతో ఈ ప్రాంతాన్ని మరింత రక్తసిక్తం చేస్తోంది. చత్తీస్‌గఢ్‌తో మొదలై మహారాష్ట్ర, ఒడిశా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు విస్తరించిన ఈ దుర్మార్గపు యుద్ధం అమాయక ఆదివాసీల జీవితాలను బలిగొంటోంది. సొంత ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి ప్రభుత్వం ఏం సాధిస్తుంది? ఇది కేవలం దూకుడు, ఆత్మరక్షణ శక్తుల మధ్య పోరాటం కాదు. ఇది భారత ప్రభుత్వం తన కార్పొరేట్ అనుకూల విధానాలను రుద్దడానికి సాగిస్తున్న ఏకపక్ష యుద్ధం. ఈ హింసాత్మక వాతావరణంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి శాంతి చర్చలే ఏకైక మార్గమని మావోయిస్టులు చేస్తున్న ప్రకటన వారి చిత్తశుద్ధికి నిదర్శనం. సాయుధ పోరాటం కంటే ఇతర శాంతియుత మార్గాల్లోనూ ప్రజల ప్రయోజనాలను సాధించవచ్చని వారు విశ్వసిస్తున్నారు. బుద్ధుడు, మావో ఆలోచనా విధానాలను పాటిస్తున్నారు. ఒకవైపు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటిస్తున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం చర్చలకు ముందుగానే మావోయిస్టులు లొంగిపోవాలనే షరతు విధించడం అత్యంత హాస్యాస్పదమైన విషయం. ప్రభుత్వం ముందుగా చర్చలకు వచ్చి మిగిలిన అంశాలను తేల్చాక కదా లొంగిపోవాలనే డిమాండ్ పెట్టేది. ఈ పోరాటంలో భారత ప్రభుత్వం సామాన్య ప్రజలను నేరుగా లక్ష్యంగా చేసుకుంటోందని మావోయిస్టులు అంటున్నారు. పైకి ఇది మావోయిస్టులకు వ్యతిరేకంగా జరుగుతున్నట్టు చిత్రీకరిస్తున్నా 'ఆపరేషన్ కగార్' కారణంగా చనిపోతున్న వారిలో దాదాపు ముప్పావు వంతు మావోయిస్టులు కాని, నిరాయుధులైన పౌరులేనని వారు వాదిస్తున్నారు. మధ్య భారతదేశంలో సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే భారత ప్రభుత్వం ఈ యుద్ధాన్ని ప్రారంభించిందని శాంతి చర్చల కమిటీ కూడా తీవ్రంగా ఆరోపిస్తోంది. ఆ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న ఆదివాసీలను తుడిచిపెట్టి, భారతదేశాన్ని ఆదివాసీ- ముక్త దేశంగా మార్చడమే ప్రభుత్వ అసలు లక్ష్యమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది బలగాలు, వందలాది సైనిక శిబిరాల మధ్య నలిగిపోతున్న ఆదివాసీల జీవితాలు క్షణక్షణం ప్రమాదంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ తమ దండకారణ్య కమిటీ చేసిన ప్రతిపాదనలను చత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి పంపింది. చత్తీస్‌గఢ్‌తో పాటు మహారాష్ట్ర, ఒడిశా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కూడా వెంటనే శాంతి చర్చలకు రావాలని మావోయిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు. 'అణచివేతకు గురైన ప్రజలు, అణగారిన వర్గాలు, అణచివేతకు గురైన జాతీయతలకు వ్యతిరేకంగా 'కగార్' యుద్ధం జరుగుతోంది' అని మావోయిస్టులు కుండబద్దలు కొట్టినట్టు స్పష్టం చేస్తున్నారు. ఇది కేవలం మావోయిస్టులకు, ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న సాధారణ వివాదం కాదు. జనవరి 2024 నుంచి 'ఆపరేషన్ కగార్' పేరుతో కొనసాగుతున్న ఈ మారణహోమంలో ఇప్పటివరకు 400 మందికి పైగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ మానవ విధ్వంసానికి వ్యతిరేకంగా దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగానూ గళాలు వినిపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితిలో సైతం భారతదేశంలో ఆదివాసీల హక్కుల ఉల్లంఘన తీవ్రంగా చర్చకు వచ్చింది. ఈ దారుణమైన యుద్ధంలో భారత ప్రభుత్వం కేవలం తన సైనిక బలగాలనే కాకుండా ఆదివాసీ యువతను సైతం నియమించి, వారిచేత ఇతర ఆదివాసీలను చంపిస్తోంది. బలవంతంగా లొంగిపోయిన నక్సలైట్లను కూడా ప్రభుత్వ అణచివేత వ్యూహంలో భాగంగా ఉపయోగించే ప్రమాదం ఉంది. ఇది ఆ ప్రాంతంలో అంతర్యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తోంది. గత ఏడాది ప్రధాని నరేంద్ర మోడీ ఆస్ట్రియా పర్యటన సందర్భంగా వియన్నాలో జరిగిన కమ్యూనిటీ కార్యక్రమంలో మాట్లాడుతూ భారత్ బుద్ధుడిని ఇచ్చిందని, యుద్ధాన్ని కాదని ప్రపంచానికి గర్వంగా చెప్పగలమని అన్నారు. అంతేకాదు భారతదేశం ఎప్పుడూ శాంతి గురించి మాట్లాడుతుందన్నారు. మరి ఆయన ప్రభుత్వం దేశంలో చేస్తున్నదేమిటని ప్రపంచ దేశాలు ప్రశ్నిస్తున్నాయి. సొంత ప్రజలను సొంత ప్రజలపైనే ఉసిగొల్పుతున్న ప్రభుత్వ దుర్మార్గపు చర్య ఇది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఏర్పడిన శాంతి చర్చల కమిటీ తక్షణమే కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు రావాలని ప్రభుత్వానికి, మావోయిస్టులకు విజ్ఞప్తి చేసింది. ఇప్పుడు మరోసారి హైదరాబాద్‌లో ఏర్పడిన శాంతి చర్చల కమిటీ చేసిన ప్రతిపాదనకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సానుకూలంగా స్పందించింది. ప్రజల ప్రయోజనాలను కేవలం సాయుధపోరాటం ద్వారానే కాకుండా ఇతర శాంతియుత మార్గాల్లోనూ సాధించవచ్చని వారు స్పష్టం చేశారు. తీవ్రమైన పోరాటంలో చిక్కుకున్నా మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధంగా ఉండడం వారి రాజకీయ పరిణతిని, ప్రజలపట్ల వారికున్న నిబద్ధతను తెలుపుతోంది. కేవలం ఆదివాసీల గురించే కాకుండా ఆదివాసీయేతర ప్రజల ప్రయోజనాల గురించి కూడా వారు ఆలోచిస్తున్నారు. శాంతి చర్చలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడితే, పాలకుల అభివృద్ధి నమూనా తెచ్చిన మారణహోమం, రాజ్యాంగ పాలనలో నెలకొన్న సామాజిక, సాంస్కృతిక ఆందోళనల గురించి కూడా చర్చించడానికి వారు సిద్ధంగా ఉన్నారు. మతపరమైన మైనారిటీలపై జరుగుతున్న వివక్ష, ఆదివాసీ, ఆదివాసీయేతర ప్రజల సాంస్కృతిక సంప్రదాయాల రక్షణ గురించి వారు గళం విప్పుతున్నారు. పౌరుల ప్రాణాలకు అత్యంత విలువనిస్తూ, మావోయిస్టులు శాంతి చర్చలకు సుముఖత వ్యక్తంచేయడం వారి మానవత్వాన్ని చాటుతోంది. ఆరు రాష్ట్రాల్లో భీకర యుద్ధం కొనసాగుతున్నా, పౌర సమాజం హృదయపూర్వక పిలుపునకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ వెంటనే స్పందించడం గమనార్హం. చర్చలతో తమకు లాభం చేకూరుతుందా లేదా అనే స్వార్థపూరిత ఆలోచనను పక్కనబెట్టి, శాంతి ప్రతిపాదన వచ్చినప్పుడల్లా మావోయిస్టులు సానుకూలంగా స్పందించడం వారి చిత్తశుద్ధిని, ప్రజల పట్ల వారికున్న బాధ్యతను తెలుపుతోంది.

# కృత్రిమ మేధతో కష్టకాలం!



'ఉద్యోగం పురుష లక్షణం' అన్నది ఒకప్పటి పెద్దల మాట. మగవాడు ఏదో ఒక ఉద్యోగం చేయాలన్నది అప్పటి పెద్దల భావన. కాస్తో కూస్తో చదువుకొన్నవాడు ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా వ్యవసాయం లేదా కుల వృత్తో చేసుకునేవాడు. అదే ఇంటర్ లేదా డిగ్రీ దాకా చదువుకొన్నవాడయితే ఏ టీచరుగానో లేదా ప్రభుత్వ కార్యాలయాల్లో క్లర్క్ గానో లేదా కాస్త పైస్థాయి ఉద్యోగంలోనో స్థిరపడాలనుకునేవాడు. కార్యాలయాల్లో కాస్త పని ఒత్తిడి ఉన్నా నెల తిరిగే సరికి జీతం కళ్ల చూస్తామనే ధీమా ఉండేది. అలా ఏ ముప్ఫై ఏళ్లో, అంతకుపైబడి ఒకే శాఖలోనో, కార్యాలయంలోనే పని చేసి రిటైర్ అయ్యేవాళ్లు. ఇలాంటి బలమైన వేతన జీవుల వర్గం సమాజంలో ఉంటూ వచ్చింది. అయితే ఇప్పుడు ఈ వర్గం క్రమేణా కనురుగయ్యే స్థితి వస్తోంది అని నిపుణులు అంటున్నారు. వీరి స్థానాన్ని ఆటోమేషన్, ఏఐగా పిలుచుకునే కృత్రిమ మేధస్సు ఆక్రమించనుందనేది వారి అంచనా. భారత దేశం ఈ కొత్త దశలోకి ప్రవేశించిందని వారు అభిప్రాయం. మన తల్లిదండ్రులు ఒకే సంస్థలో 30 ఏళ్లు పని చేసిన పాత విధానం అంతరించపోనుంది. భారతీయ మధ్య తరగతి నిర్మాణం, ఉద్యోగ వ్యవస్థ ఇక ఎంతో కాలం మనజాలదు' అని ప్రముఖ మార్కెట్ నిపుణుడు, పోర్టుఫోలియో మేనేజ్‌మెంట్ సేవల సంస్థ మార్సెలస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ వ్యవస్థాపకుడు సౌరభ్ ముఖర్జియా అంటున్నారు. ఆయన మాటల్లో చెప్పాలంటే వైట్‌కాలర్ ఉద్యోగులు చేసే పనుల్లో చాలా వరకు ఇప్పుడు కృత్రిమమేధ చేసేస్తోంది. తమ కోడింగ్‌లో మూడింట ఒక వంతు కృత్రిమ మేధ చేసేస్తోందని ఇప్పటికే గూగుల్ సంస్థ అంటోంది. భారతీయ ఐటి, మీడియా, ఫైనాన్సింగ్ రంగాల్లోనూ ఇదే పరిస్థితి వస్తోంది. టెక్నాలజీ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కారణంగా మధ్యస్థాయి కెరీర్ అవకాశాలు క్రమంగా కనుమరుగయ్యే సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని కూడా ఆయన గుర్తు చేస్తున్నారు. అంటే రాబోయే రోజుల్లో ఉదయం 10.00 గంటలకు ఆఫీసుకు వెళ్లి సాయంత్రం 5 గంటల దాకా ఫ్యాన్ కింద కూర్చొని పని చేసి



ఒకటో తేదీ నాటికల్లా ఠంచనుగా జీతం తీసుకుంటూ నిశ్చింతగా జీవితం గడిపేసే వేతన జీవులు ఇకపై క్రమేణా తగ్గిపోతారన్న మాట. కంప్యూటర్లు, కృత్రిమ మేధ వారి పని చేసేస్తాయేమో! అందుకే గత కొన్నేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల ఖాళీలను కూడా భర్తీ చేయడం లేదు. ప్రభుత్వ ఉద్యోగమనేది అందని మానిపండులాగా మారడంతో నిరుద్యోగులు సైతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ప్రైవేటు ఉద్యోగాలను వెతుక్కొంటున్నారు. కాని నిరుద్యోగులు లక్షల్లో ఉండడంతో ఆ ఉద్యోగాలు కూడా కొంత మంది అదృష్టవంతులకే దక్కుతున్నాయి. మిగిలిన వారు అటు ఉద్యోగం దొరక్క, ఇటు వేరే పని చేయడం చేతకాక 'రెంటికీ చెడ్డ రేవడి' గా మారిపోతున్నారు. కొందరైతే నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. అయితే దీనికి ఎవరినీ నిందించాల్సిన పని లేదు. కాలం తెచ్చిన మార్పు ఇది. అందుకే ప్రభుత్వం సైతం ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలను సృష్టించే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారాలని విద్యావంతులైన నిరుద్యోగులకు సలహా ఇస్తోంది. ఆ దిశగా చర్యలు కూడా తీసుకుంటోంది. ఫలితంగా ఇప్పుడు గత కొన్నేళ్లుగా ప్రభుత్వం చెప్పుకోదగ్గ విజయాలను కూడా సాధించింది. దీన్నే 'జామ్ ట్రినిటీ'గా వ్యవహరిస్తున్నారు. జన్‌ధన్, ఆధార్, మొబైల్ ఈ మూడింటి సహకారంతో కొత్త ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తయారవుతున్నారు. స్టార్టప్‌లు అలాంటి వాటిలో ప్రధానమైనవి. అలాగే ఇంటి వద్దే కూర్చుని వేలాది రూపాయలు ఆర్జించే స్థాయికి చాలా మంది చేరుకుంటున్నారు. ఇప్పుడు తక్కువ ఆదాయ వర్గాల వారికి సైతం బ్యాంకులు, ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, రుణ పథకాలకు సంబంధించిన సమాచారం సులువుగా లభించడంతో వాటి సహాయంతో స్వయంగా వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలుగా మారుతున్నారు. ఇదే స్ఫూర్తిని కార్పొరేట్ కెరీర్‌లలోనూ కొనసాగించినట్లయితే లక్షలాది మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తయారవుతారని, దేశం అభివృద్ధికి మరో కొత్త చోదకశక్తిగా మారుతారని నిపుణులు అంటున్నారు. నిలకడైన జీవితం, నెల తిరిగే సరికి జీతం అందుకునే మనస్తత్వం నుంచి భారతీయ సమాజం మారాల్సిన అవసరం ఉందని కూడా వారు సలహా ఇస్తున్నారు. మనది డబ్బుతో అన్నింటినీ అంచనా వేసే సమాజం. మీరు పొందే వేతనంతో మీ సక్సెస్‌ను అంచనా వేస్తుంటారు. ఈ మనస్తత్వం ఇకపై మారాల్సిన అవసరం ఉంది. కేవలం ప్రతినెలా వచ్చే ఆదాయం కాకుండా సంతోషం కోసం కొత్త మార్గాలను అన్వేషించుకోవలసిన అవసరం ఉంది. మన పిల్లలను కేవలం ఉద్యోగాల కోసం ఎదురు చూసే పిల్లలుగా తయారు చేయడం ఇకపై మానుకోవడం మంచిది. ఎందుకంటే, రాబోయే రోజుల్లో ఉద్యోగాలు అనేవి ఉండవేమోనని నిపుణుల అభిప్రాయం. మరి ఆ స్థితికి భారతీయులు మారుతారా! అలాంటి పరిస్థితి ఎన్నేళ్లలో వస్తుంది? ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

## ఓటర్ల పత్రాలు సమర్పించిన 98.2శాతం మంది




న్యూఢిల్లీ : బీహార్‌లో 98.2శాతం మంది కంటే ఎక్కువ మంది ఓటర్ల పత్రాలను సమర్పించినట్లు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఆదివారం తెలిపింది. ఇక ఎనిమిది రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉందని వెల్లడించింది. ఓటర్ల ముసాయిదా జాబితాలో తప్పులను సరిదిద్దడం మాత్రమే కాకుండా, వారి గణనఫారమ్‌లతో పాటు అవసరమైన పత్రాలను కూడా సమర్పించవచ్చని తెలిపింది. బీహార్ సిఇఒ కార్యాలయం సమాచారం ప్రకారం.. జూన్ 24 నుండి ఆగస్ట్ 24 వరకు, 60 రోజుల్లో 98.2శాతం మంది తమ పత్రాలను సమర్పించినట్లు తెలిపింది. రోజుకు సగటున 1.64శాతం పత్రాలు సమర్పించారని, ఇంకా ఎనిమిదిరోజులు ఉన్నాయని, పత్రాలను సమర్పించేందుకు కేవలం 1.8శాతం ఓటర్లు మాత్రమే మిగిలి ఉన్నారని పేర్కొంది. బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేనివారు వాటిని చేర్చాలని కోరుతూ ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు అందజేయవచ్చని సుప్రీంకోర్టు పేర్కొన్న సంగతి తెలిసిందే. వ్యక్తిగతంగా దరఖాస్తులు అందజేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఆ దరఖాస్తుతోపాటు ఎన్నికల కమిషన్ పేర్కొన్న 11 పత్రాల్లో ఏ ఒక్కదాన్నైనా లేదా ఆధార్ కార్డు కాపీని అందజేయవచ్చని కోర్టు పేర్కొంది.

## రిజిస్ట్రేషన్ తేదీల్లో మార్పు



న్యూఢిల్లీ : దేశంలోని ఐఐటీ సహా పలు విద్యా సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశించేందుకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ పరీక్షకు షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల తేదీల్లో మార్పులు చేసినట్లు ఐఐటీ గువాహటి ఓ ప్రకటనలో తెలిపింది. నోటిఫికేషన్ ప్రకారం.. ఆగస్టు 25 నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఆగస్టు 28 నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించన్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బుక్‌లెట్‌లోనూ మార్పులు చేసినట్లు పేర్కొంది. ఆలస్య రుసుంతో అక్టోబర్ 9 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. దరఖాస్తు కోసం ఒక్కో టెస్ట్ పేపర్‌కు మహిళలు/ఎస్సీ/ఎస్టీ/ విభిన్న ప్రతిభావంతులైతే వెయ్యిరూపాయలు, ఇతర కేటగిరీలు, విదేశీ విద్యార్థులు రూ.2000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. కేటగిరీ, టెస్ట్ పేపర్, ఎగ్జామ్ సిటీ మార్పు, కొత్త టెస్ట్‌పేపర్ జతచేసుకోవడం, వ్యక్తిగత వివరాలను మార్చుకొనేందుకు అదనపు ఫీజుతో నవంబర్ 6వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపింది. అడ్మిట్ కార్డులను జనవరి 2న విడుదల చేయనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7, 8, 14, 15 తేదీల్లో (శని, ఆదివారాల్లో) దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నారు. ఫలితాలు మార్చి 19న విడుదల చేయనున్నారు. స్కోర్ కార్డులను మార్చి 27 నుంచి మే 31వరకు ఉచితంగా అందుబాటులో ఉంచుతారు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులే. అందువల్ల, దరఖాస్తు చేసే ముందు అభ్యర్థులు ఈ పరీక్షకు అర్హతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నారో, లేదో గేట్ అధికారిక వెబ్‌సైట్‌లో నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి ఒక దరఖాస్తు మాత్రమే చేయాలి. ఒకవేళ రెండు పేపర్లు రాయాలనుకుంటే.. ఒకే ఫారమ్‌లో దాన్ని పేర్కొనాల్సి ఉంటుంది. ఒకటికంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పిస్తే తిరస్కరిస్తారు. వాటికి చెల్లించిన ఫీజును రిఫండ్ చేయరు. గేట్ స్కోర్‌ను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు సైతం పరిగణనలోకి తీసుకుంటారు. ఐఐటీలు గేట్ స్కోర్‌తో నేరుగా పీహెచ్‌డీలో కూడా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు, పేపర్ల వారీగా సిలబస్, ఎలిజిబిలిటీ, ఇతర అప్‌డేట్స్‌ను gate2026.iitg.ac.inవెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.ు

## జూన్ 20 నుండి వర్షాలతో 298 మంది మృతి



సిమ్లా : రుతుపవనాలతో జూన్ 20న వర్షాలు ప్రారంభమైనప్పటి నుండి హిమాచల్‌ప్రదేశ్ వ్యాప్తంగా మొత్తం 298మంది ప్రాణాలు కోల్పోయారని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎస్‌డిఎంఎ) ఆదివారం వెల్లడించింది. ఎస్‌డిఎంఎ నివేదిక ప్రకారం.. 298 మృతుల్లో 152 వర్షాలకు సంబంధించినవి. ముఖ్యంగా కొండ చరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, ఇళ్లు కూలిపోవడం మరియు ఇతర వాతావరణ ప్ర భావాల వలన సంభవించాయి. 146 మరణాలు రోడ్డు ప్రమాదాల వలన జరిగాయి. వీటిలో వర్షాలతో రహదారులపై వాహనాలు అదుపుతప్పడం, దెబ్బతిన్న రోడ్లతో ప్రమాదాల మృతులు ఉన్నారు. భారీ వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లోని రహదారులు సహా ఇతర మౌలిక సదుపాయాలు తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొన్నాయి. రెండు జాతీయ రహదారులు (ఎన్‌హెచ్-03 మరియు ఎన్‌హెచ్-305) సహా 400 రహదారులు మూసుకుపోయాయి. 208 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి, అలాగే 51 నీటి పంపిణీ వ్యవస్థలు పనిచేయడం లేదని ఎస్‌డిఎంఎ తెలిపింది. మండి జిల్లాలో అత్యధికంగా 220 రహదారులు మూసుకుపోయాయి. వీటిలో ఎన్‌హెచ్-03 కూడా ఉంది. కులులో ఎన్‌హెచ్ -305తో పాటు 101 రహదారులు బ్లాక్ అయ్యాయి. బంజార్, బలిచౌకిలోని అనేక ఈ రహదారికి ఇతర రహదారులతో సంబంధాలు తెగిపోయాయి. కాంగ్రాలో 21, చంబాలో 24, సిమ్లాలో 8,సిర్మౌర్‌లో 9, కిన్నౌర్‌లో రెండు, లాహౌల్-స్పితిలో ఒకటి, బిలాస్ పూర్‌లో రెండు రహదారులు మూసుకుపోయినట్లు తెలిపింది. మండిలో 134 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కులులో 17, చంబాలో 26, కిన్నౌర్‌లో 23 మరియు కాంగ్రాలో 6 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా మండి (36), లాహౌల్-స్పితిలో రెండు నీటిపంపిణీ వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఇతర ప్రాంతాల్లో స్వల్ప అంతరాయాలు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. రహదారులు, విద్యుత్ పునరుద్ధరణ, అత్యవసర నీటి సరఫరా చర్యలను అధికారులు చేపట్టారు. అయితే భారీ వర్షాలు సహాయ చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయి. వర్షాలు కొనసాగుతున్నందున లోతట్టు, కొండచరియలు విరిగిపడే అవకాశమున్న ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలని, ఎప్పటికప్పుడు అధికారుల సూచలను పాటించాలని ఎస్‌డిఎంఎ ప్రజలకు సూచించింది.

## ట్రంప్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా పరిగణించాలి



వాషింగ్టన్ : రష్యా నుండి చమురు దిగుమతులపై ట్రంప్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా పరిగణించాలని రిపబ్లికన్ నేత నిక్కీహేలీ శనివారం అన్నారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు భారత్, అమెరికాతో కలిసి పనిచేయాలని అన్నారు. వాణిజ్య విభేదాలు మరియు రష్యన్ చమురు దిగుమతులు వంటి సమస్యలను పరిష్కరణకు చర్చలు, సంప్రదింపులు ముఖ్యమని సోషల్‌మీడియా పోస్టులో పేర్కొన్నారు. భారతీయ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50శాతం సుంకం విధించిన అనంతరం రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీనిపై నిక్కీ హేలీ గతవారం మీడియాలో వెల్లడించిన అభిప్రాయంలో కొంతభాగాన్ని ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్‌కు అనుకూలంగా వ్యవహరించడంతో సొంత పార్టీలోనే ఆమె విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా క్రూరమైన యుద్ధానికి నిధులు సమకూర్చడానికి సహాయపడే భారత్ భారీ రష్యన్ చమురు కొనుగోళ్లను ట్రంప్ లక్ష్యంగా చేసుకోవడం సరైనదే అని హేలీ తన వ్యాసంలో పేర్కొన్నారు. అయితే భారత్ చైనాలాగా విరోధిగా భావించకూడదని, స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య భాగస్వామిగా భావించాలని ఆమె పేర్కొన్నారు. రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికాల మధ్య దశాబ్దాల స్నేహం, విశ్వాసమే .. ప్రస్తుత అడ్డంకులను దాటేందుకు బలమైన పునాదిగా ఉపయోగపడుతుందని అన్నారు.

# ఐపీవో నిధుల సమీకరణకు కోత..!

### పరిమాణాన్ని తగ్గించుకుంటున్న కంపెనీలు

### జాబితాలో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, ఏథర్ ఎనర్జీ

### ష్లాస్ బెంగళూరు, మొబిక్విక్, ఎన్‌ఎస్‌డీఎల్

### మార్కెట్ల అనిశ్చితి, పలు పెట్టుబడి అవకాశాల ఎఫెక్ట్




ఇటీవల తిరిగి ప్రైమరీ మార్కెట్లు జోరందుకున్నప్పటికీ పలు కంపెనీలు ఐపీవో నిధుల సమీకరణకు కోత పెడుతున్నాయి. సెకండరీ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, పెట్టుబడులకు పలు అవకాశాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు సైతం అంతగా ఆసక్తి చూపకపోవడం వంటి అంశాలు ప్రభావం చూపుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. నిజానికి ప్రస్తుత కేలండర్ ఏడాది (2025)లో పలు అన్‌లిస్టెడ్ కంపెనీలు పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు క్యూ కడుతున్నాయి. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేస్తున్నాయి. అనుమతులు సైతం పొందుతున్నాయి. అయితే జనవరి మొదలు ప్రపంచ దేశాలపై అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ అదనపు సుంకాలను విధిస్తుండటంతో సెంటిమెంటు బలహీనపడినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. ప్రధానంగా భారత్ ఎగుమతులపై ఇటీవల 50 శాతంవరకూ టారిఫ్‌లను ప్రకటించడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలియజేశారు. యూఎస్ టారిఫ్‌ల కారణంగా సముద్ర ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, లెదర్, జ్యువెలరీ, కెమికల్స్ తదితర పలు రంగాలు ప్రభావితంకావచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఫార్మాపై సైతం సుంకాలు విధించే వీలున్నట్లు ట్రంప్ హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. ఫలితంగా కొద్ది నెలలుగా దేశీ స్టాక్ మార్కెట్లు కన్సాలిడేషన్ బాటలోనే సాగుతున్నట్లు నిపుణులు తెలియజేశారు. వీటికితోడు దేశీ కంపెనీల ఏప్రిల్%-%జూన్(క్యూ1) ఫలితాలు ఆకట్టుకోకపోవడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సైతం దేశీ స్టాక్స్ నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో పలు అన్‌లిస్టెడ్ కంపెనీలు ఐపీవో ద్వారా సమీకరించదలచిన నిధుల పరిమాణాన్ని తగ్గించుకుంటున్నాయి.

### పునరాలోచనలో..

ఈ ఏడాది జనవరి నుంచి పలు కంపెనీలు లిస్టింగ్‌కు ఆసక్తి చూపుతున్నప్పటికీ సమీకరించతలపెట్టిన నిధుల పరిమాణంలో కోత పెట్టుకుంటున్నట్లు మార్కెట్ నిపుణులు తెలియజేశారు. వెరసి 2025లో ఇప్పటివరకూ సుమారు 15 కంపెనీలు ఇష్యూల పరిమాణాన్ని తగ్గించుకున్నాయి. ఈ జాబితాలో ఇటీవల లిస్టయిన దిగ్గజాలు ఎన్‌ఎస్‌డీఎల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌సహా.. ఏథర్ ఎనర్జీ, ఎస్‌కే ఫైనాన్స్, బ్లూస్టోన్, మొబిక్విక్, ష్లాస్ బెంగళూరు(లీలా హెూటల్స్), ఇండిక్యూబ్, అర్బన్ కంపెనీ, స్మార్ట్ వర్క్స్, స్వస్తికా ఇన్‌ఫ్రా తదితరాలు చేరాయి.

### 48 కంపెనీల లిస్టింగ్

ఈ కేలండర్ ఏడాదిలో ఇప్పటివరకూ 48 కంపెనీలు ఐపీవోలు చేపట్టి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాయి. తద్వారా రూ. 64,135 కోట్లు సమకూర్చుకున్నాయి. అంతక్రితం ఏడాది అంటే 2024లో 90 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి వచ్చాయి. తద్వారా ఏకంగా రూ. 1,67,535 కోట్లు(19.5 బిలియన్ డాలర్లు) సమీకరించాయి. ఇది రికార్డుకాగా.. ఈ ఏడాది ద్వితీయార్థంలోనూ పలు దిగ్గజాలు లిస్టింగ్ బాటలో సాగనున్నాయి.

### పలు అవకాశాలు

ప్రైమరీ మార్కెట్లలో కొన్ని నెలలుగా చిన్న, మధ్యతరహా సంస్థలు(ఎస్ఎంఈ) సైతం సందడి చేస్తున్నాయి. దీంతో ఎన్ఎస్ఈ ఎమర్జ్, బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్స్ ద్వారా పలు చిన్న కంపెనీలు సైతం భారీ స్థాయిలో ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటున్నట్లు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు పేర్కొన్నాయి. మరో వైపు కొద్ది నెలలుగా బంగారం, వెండి వంటి విలువైన లోహాలు ఆకర్షణీయ రిటర్నులు ఇవ్వడం, రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ల ఐపీవోలు, మ్యూచువల్ ఫండ్‌ల సిప్ పథకాలు ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. దీంతో మెయిన్ బోర్డ్ ప్రైమరీ మార్కెట్లో కొన్ని ఇష్యూలు మాత్రమే లిస్టింగ్‌లోనూ విజయవంతమవుతున్నట్లు వివరించారు.

### వెనకడుగు తీరిదీ...

వివిధ ప్రతికూలతల కారణంగా తొలుత వేసిన ప్రణాళికలను సవరిస్తూ కొన్ని కంపెనీలు ఐపీవో నిధుల సమీకరణ పరిమాణంలో కోత పెడుతున్నాయి. జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ. 4,000 కోట్ల విలువను రూ. 3,600 కోట్లకు సవరించగా.. ఏథర్ ఎనర్జీ రూ. 3,100 కోట్ల నుంచి రూ. 2,626 కోట్లకు తగ్గించుకుంది. ఈ బాటలో ఎస్‌కే ఫైనాన్స్ రూ. 2,200 కోట్లస్థానే రూ. 1,600 కోట్లు మాత్రమే సమీకరించగా.. బ్లూస్టోన్ రూ. 1,000 కోట్ల నుంచి రూ. 820 కోట్లకు వెనకడుగు వేసింది. లీలా హెూటల్స్ రూ. 5,000 కోట్ల ప్రణాళికను రూ. 3,000 కోట్లకు కుదిస్తే.. మొబిక్విక్ రూ. 1,900 కోట్ల నుంచి రూ. 700 కోట్లకు భారీగా కోత పెట్టుకుంది.

# అరుణ సమరసేనాని





ఒక పీడిత జన బాంధవుడు నిష్క్రమించాడు. ఒక పోరాట స్వరం మూగబోయింది. అతడనేక ప్రజాసమరాలను నడిపించిన నాయకుడు. నిబద్ధ కమ్యూనిస్టు యోధుడు. మానవీయ విలువలకు, స్నేహ సంబంధాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఆశయ పథగామి, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకుడు సురవరం సుధాకర రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు. 84 సంవత్సరాల వయోభారపు అనారోగ్యంతో హైదరాబాదులో ఆయన తుది శ్వాస విడిచారు. చివరి శ్వాసవరకూ కమ్యూనిస్టు సైద్ధాంతిక నిబద్ధతను, అంకిత భావాన్ని కలిగి ఉన్న మహెూన్నత వ్యక్తిత్వం ఆయనది. ఆరుపదుల ఉద్యమ పయనంలో అలుపులేని పోరాట ధీరుడు. విద్యార్థి దశ నుండే కమ్యూనిస్టు భావాల ప్రేరణతో ఉద్యమబాట పట్టి, విద్యార్థి సంఘనేతగా మొదలయి భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన అరుణ సమరసేనాని సురవరం. తెలంగాణ నేల నుండి జాతీయ స్థాయికి చేరుకున్న కమ్యూనిస్టు దిగ్గజం. తెలంగాణ సాంస్కృతిక రంగ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి సోదరుడు వెంకట రామిరెడ్డి తనయుడుగా వారి వారసత్వపు చైతన్యాన్ని పుణికి పుచ్చుకున్న వారు సుధాకరరెడ్డి. తండ్రి తెలంగాణా సాయుధ పోరాట యోధుడు కావటం వలన చిన్నతనంలోనే వీరిలో భావజాల ప్రభావం కలిగింది. మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లి గ్రామంలో 1942 మార్చి 25న జన్మించిన సురవరం, కర్నూలులో విద్యనభ్యసించిన సమయంలోనే విద్యార్థుల సమస్యలపై ఉద్యమం చేపట్టారు. అఖిల భారత విద్యార్థి సంఘంలో నాయకునిగా అడుగులు వేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను గరిపి విద్యార్థి సంఘ జాతీయ నాయకునిగా ఎదిగారు. ఆ తర్వాత యువజన సంఘ నాయకునిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రానికి కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగానూ 2012 నుండి 2019 వరకు మూడు పర్యాయాలు సిపిఐకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సురవరం నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నుండి రెండుసార్లు గెలిచారు. కార్మిక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి ఛైర్మన్‌గా, అనేక కమిటీలలో సభ్యులుగా సేవలందించారు. లోక్‌సభలో ప్రజా సమస్యలను వినిపించడంలో ముందుండేవారు. స్పష్టమైన అభిప్రాయాలతో అనర్గళంగా మాట్లాడగలిగిన ఉపన్యాసకుడు. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం చేస్తున్న యుద్ధాల గురించి, దోపిడీ గురించి, జాతీయంగా ముంచుకొస్తున్న మతోన్మాదం, కార్పొరేట్ దోపిడీ గురించి విడమరచి వివరించగల మేధోసంపన్నుడు సురవరం. నిత్య అధ్యయనశీలి, అనారోగ్య సమయాలలోనూ అధ్యయనాన్ని కొనసాగించి వామపక్ష, అభ్యుదయ శక్తులకు ప్రేరణను అందించిన చైతన్యశీలి. వామపక్ష ఉద్యమాల ఐక్యతను బలంగా కోరుకున్నారు. అందుకు తీవ్రంగా కృషి చేశారు. నేటి మతతత్వ శక్తుల విస్తరణను తిప్పికొట్టేందుకు సమష్టిగా కృషిచేయాలని తపనపడ్డారు. నేడు బీజేపీ నియోఫాసిస్టు ధోరణులతో దేశంలో ఉన్మాదాన్ని సృష్టిస్తూ, ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న తరుణంలో, దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్న శక్తులందరికీ సురవరం మరణం ఒక లోటు. వారు, మనకందించిన పోరాట స్ఫూర్తితో మరింత పదునుగా ఉద్యమాలను ముందుకు తీసుకొనిపోవటమే ఆయనకు మనమందించే నిజమైన నివాళి. వ్యక్తిగతంగా సురవరం నాయకులతో, కార్యకర్తలతో కొనసాగించిన ఆత్మీయ సంబంధాలు, స్నేహం, ప్రేమ, గౌరవమర్యాదలు ఎంతో ఆకట్టుకునేవి. కమ్యూనిస్టులు అనగానే ఎంతో వాత్సల్యాన్ని చూపేవారు. ఆదరించేవారు. ప్రజాస్వామిక, మానవీయ విప్లవ విలువలతో బతికిన సురవరం జీవితం స్ఫూర్తిదాయకం. అందుకే "వామపక్ష నేతగా ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, లౌకిక ప్రజాస్వామిక ఉద్యమాలకు ఆయన మరణం తీరని లోట"ని, సీపీఐ(ఎం) తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. సార్ధకమైన జీవితాన్ని గడిపిన సురవరం ఆదర్శ కమ్యూనిస్టునేత. వారికి విప్లవ జోహార్లు!

# నడిచే రాజ్యాంగం-జస్టిస్ సుదర్శన్ రెడ్డి



కొంత మందిని మనం వాకింగ్ లైబ్రరి అంటుంటాం. అంటే లైబ్రరి నడిచి వస్తుందని కాదు. ఒక వ్యక్తికి అనేక విషయాలపైన అపారమైన జ్ఞానం ఉంటే ఆ వ్యక్తిని వాకింగ్ లైబ్రరి అనడం పరిపాటి. అయితే వాకింగ్ కాన్‌స్టిట్యూషన్ అనే పేరు ఎవరికైనా ఉందా? ఇప్పటి వరకు ఆ పేరు ఎవరికి ఖాయం కాలేదు. కానీ గత 50 ఏళ్లకు పైని భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవడం మాత్రమే కాకుండా, ఇంటి నుంచి బయటకు కదిలితే ఆయన కోటు పాకెట్‌లో భారత రాజ్యాంగం పాకెట్ బుక్ ఉంటుంది. అది తన కోటులో లేకుండా బయటకు కదలడం నేను చూడలేదు. గత పదిహేను సంవత్సరాలుగా అనేకసార్లు ఆయనతో కలిసి మాట్లాడడం, సభల్లో పాల్గొనడం, ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన సభలకు నిర్వాహకుడుగా వ్యవహరించడం జరిగింది. ఏ సందర్భంలో కూడా ఆయన భారత రాజ్యాంగం పుస్తకం లేకుండా నాకు కనిపించలేదు. ఆయనెవరో కాదు, భారత ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి. ఆయన రాష్ట్రపతి పదవికి (%జూశీర్ాతీవంఱవత్%) పోటీ చేయడం అనే అంశం చాలా ఆశ్చర్యం. నిజానికి ఆయన అటువంటి పదవులు కావాలని భావించి ఉంటే ఇప్పటికే ఎన్నో అవకాశాలు వచ్చేవి. కాని ఆయన ఎటువంటి రాజకీయ పదవులు కోసం ప్రయత్నిం లేదు. ఇది నేను ఖచ్చితంగా చెప్పగలను. ఆయన సుప్రీంకోర్టు నుంచి పదవీ విరమణ పొందిన తర్వాత ఎన్నో పదవులకు అవకాశం ఉండింది. కానీ ఆయన అటువైపుగా ఆలోచించలేదు. కారణం, ఏమిటంటే, ఆయన ఎప్పుడైనా ఏదైనా చేయాలనుకునేవాడు, కావాలనుకునేవాడు కాదు. ఇప్పుడు కూడా ఏదో కావాలనుకునే కోరికతో ఉపరాష్ట్రపతిగా పోటీ చేయడం లేదు. తన బాధ్యతగా ఇది చేయాలని తాను రంగంలోకి దిగాడు. ఆయనను ఉపరాష్ట్రపతిగా రంగంలోకి దింపింది కేవలం అంటే కేవలం భారత రాజ్యాంగ పరిరక్షణ మాత్రమే. ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితుల్లో ఈ కర్తవ్యం నిర్వర్తించాలని ఆయన నిర్ణయించుకున్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయ్యాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా అధికారంలో ఉన్న పార్టీలు, ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని, రాజ్యాంగంలో పేర్కొన్న అనేక అంశాలను పక్కకు తోసేసి, తమ ఎజెండాను అమలు చేస్తున్నాయని ఆయన ఇటీవల అనేక సభల్లో మాట్లాడారు. అంతేకాకుండా రాజ్యాంగబద్ధంగా నిర్మితమైన చట్టసభలు, న్యాయ వ్యవస్థ, అధికార వ్యవస్థతో అనేక సంస్థలు నిర్వీర్యం అయిపోతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలన్నీ రాజ్యాంగ పరిరక్షణ దాన్ని బలంగా వినిపిస్తున్నాయి. దానికి ఒకే సంకేతంగా సుదర్శన్ రెడ్డి ఎప్పటి నుంచో తన వెంట ఉంచుకొంటున్న మినీ రాజ్యాంగం పుస్తకాన్ని రాహుల్ గాంధీ లాంటి వాళ్లు వెంటపెట్టుకుంటున్నారు. అందుకోసం యాత్రలు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం సుదర్శన్ రెడ్డిని బలపరుస్తున్న 'ఇండియా' కూటమి పక్షాలన్నీ కూడా రాజ్యాంగ రక్షణ కోసం మాట్లాడుతూనే ఉన్నాయి. సుదర్శన్ రెడ్డి ఈ రోజుకు ఈ రోజు రాజ్యాంగ రక్షణ కావాలనుకోవటం లేదనే విషయాన్ని ముందే చెప్పాను. అంతేకాకుండా 'ఇండియా' కూటమి పక్షాల రాజకీయ భావాలన్నీ సుదర్శన్ రెడ్డిలో ఉన్నాయి. ఇది మరొక అంశం. 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్‌సతో పాటు ఉన్న పక్షాలలో కమ్యూనిస్టులు, మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ, సోషలిస్టు భావజాల వారసత్వం కలిగిన సమాజ్ వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, వాటితో పాటు కుల వివక్ష, ప్రాంత వివక్షలకు పోరాడుతున్న డిఎంకె, గత కొంత కాలంగా మత తత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న తృణమూల్, ఇంకా ఇతర ప్రజాస్వామిక, సెక్యులర్ భావజాలం కలిగిన వాళ్లు ఉన్నారు. ఈ భావాల మొత్తం రూపమే జస్టిస్ సుదర్శన్ రెడ్డి. ఆయన విద్యార్థిగా ఉన్న సమయంలోనే ప్రముఖ సోషలిస్టు సిద్ధాంతకర్త రామ్ మనోహర్ లోహియా భావాలకు ఆకర్షితులయ్యారు. ఆ చైతన్యంతోనే 1974 ప్రాంతంలో ప్రారంభమైన జెపి ఉద్యమంలో పాల్గొన్నారు. 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని వ్యతిరేకించి తన ప్రజాస్వామ్య ఆకాంక్షను ఎత్తి పట్టారు. 1971లో న్యాయవాదిగా తన వృత్తిని చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగ అధ్యయనం, దాని రక్షణ కోసం పని చేయడం జీవితంలో భాగమైపోయింది. ఆ తర్వాత 1993, మే 2వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియామకం జరిగినప్పటి నుంచి 2011 జులై, 7వ తేదీన పదవీ విరమణ పొందే వరకు ఆయన వెలువరించిన తీర్పులు ఎన్నో రాజ్యాంగ ప్రతిష్ఠను ఎత్తిపట్టాయి. అందులో సల్వాజుడుం పైన ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగం విశిష్టను దాని గొప్పతనాన్ని ఉన్నతంగా నిలబెట్టాయి. అదే విధంగా, పేదల పక్షాన నిలబడడంలో ఒక జడ్జిగా ఎన్నో ప్రయత్నాలు చేశారు. అసైన్డ్ భూములు ప్రభుత్వం ప్రజా అవసరాల కోసం స్వాధీనం చేసుకుంటే, ఇతర పట్టా భూములకు ఇచ్చే నష్ట పరిహారం ఇవ్వాలని, అంతకన్న తక్కువ ఇవ్వడానికి లేదని గొప్ప తీర్పు ఇచ్చారు. ఇట్లా ఎన్నైనా చెప్పుకుంటూ పోవచ్చు. అంటే రాజ్యాంగ రక్షణతోపాటు, ప్రజల, ప్రత్యేకించి ఆదివాసుల, దళితుల, పేదల హక్కుల రక్షణ కూడా ఆయన తన కర్తవ్యంలో చేర్చుకున్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇతరులతో వేరు చేసి చూడడానికి ఇంకొక విశేషాన్ని చెప్పుకోవాలి. ఆయన భారత రాజ్యాంగాన్ని సరైన రీతిలో అర్థం చేసుకున్నారనడానికి మరొక ఉదాహరణ. ఆర్టికల్ 38 అమలు, భారత దేశంలోని చాలా సమస్యలకు పరిష్కారం ఆర్టికల్ 38లో ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో ఆయన తన సమయాన్ని, మేధస్సును పూర్తిగా ఉపయోగించారు. ఆ సందర్భంలో ఎన్నో సార్లు జస్టిస్ సుదర్శన్ రెడ్డి భారత దేశంలో పెరుగుతున్న అసమానతలు అన్ని సమస్యలకు కారణమని మాతో చెప్పేవారు. ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను తొలగించడం, అంతేకాకుండా అసమానతలు పెరగకుండా చర్యలు తీసుకోవడం లాంటి బాధ్యతలను ప్రభుత్వాలు తీసుకోకపోవడం వల్లనే అనేక ఉద్యమాలు, ఆందోళనలు వస్తున్నాయని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్38 అమలు కోసం ప్రత్యేక ప్రభుత్వ విభాగం గానీ, వీలైతే ప్రత్యేక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేయాలని ఆయన భావించారు. నిజానికి ఇది గొప్ప ఆలోచన. ఆయన సామాజిక మార్గదర్శకానికి, భవిష్యత్ దర్శనానికి ఇది ఒక మచ్చు తునక. ఈ రోజు 'ఇండియా' కూటమి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మకమైనది. 'ఇండియా' కూటమిలోని పార్లమెంటు సభ్యులు మాత్రమే కాకుండా ఎన్‌డిఎలోని సభ్యులందరూ ప్రత్యేకించి ఎస్‌సి, ఎస్‌టి ఇతర ప్రజాస్వామిక భావాలు కలిగిన పార్లమెంటు సభ్యులంతా తమ తమ పార్టీ ఆజ్ఞలను ధిక్కరించి రాజ్యాంగ రక్షణ కోసం, ప్రజా వ్యవస్థల మనుగడ కోసం నిరంతరం తపిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి వైపు నిలబడడం చారిత్రక సందర్భమవుతోంది. తెలుగు రాష్ట్రాలలోని అన్ని రాజకీయ పార్టీల తమ తమ అభిప్రాయాలను పక్కన పెట్టి ఈ ఒక్కసారి రాజ్యాంగ రక్షణకు అండగా నిలబడాల్సిన అవసరమున్నది.